ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శనివారం 21 డిసెంబరు 2024

'రాళ్లపాడు' కుడి కాలువకు 140 క్యూసెక్కుల నీరు విడుదల



లింగసముద్రం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు కుడి కాలువలో 140 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. గురువారం 130 క్యూసెక్కులు విడుదల చేసిన అధికారులు శుక్రవారం మరో 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో రెండు పైపులను ఉపయోగించి సైఫన్ పద్ధతిలో నీటిని కాలువకు అందిస్తున్నట్లు ప్రాజెక్టు డీఈ వెంకటేశ్వర్లు చెప్పారు. అలాగే మరో మూడు పైపులను కూడా సైఫన్ పద్ధతిలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెండు మోటార్లను తెప్పించి కాలువకు నీటిని పంపింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కుడి కాలువ నీరు అన్నెబోయిన పల్లె వరకు వదిలినట్లు తెలిపారు.

● రాపూరు : కండలేరు డ్యాంలో 56.74 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 1700 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 1075 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

'మాలకొండ' ఆదాయం రూ.1,05,93,411



హుండీల్లోని నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వలేటివారిపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి 37 హుండీల ద్వారా (14 శనివారాలకు) రూ.1,05,93,411 ఆదాయం లభించినట్లు ఆ ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి కల్యాణ మండపంలో కందుకూరు-2 గ్రూపు దేవాలయం ప్రథమశ్రేణి కార్యనిర్వాహణాధికారి రవీంద్రనాథ్ పర్యవేక్షణలో శుక్రవారం హుండీల లెక్కింపు జరిగింది. నగదుతోపాటు 345 గ్రాముల బంగారం, 2 కేజీల 20 గ్రాముల వెండి, 152 యూఎస్ డాలర్లు, 10 కెనడా డాలర్లు, 60 ఇంగ్లండ్ పౌండ్స్ లభించాయి.

నేడు జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని జడ్పీ కార్యాలయంలో శనివారం నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో విద్యారమ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ, దీన్‌దయాళ్ అంత్యోదయ, ప్రధాన మంత్రి గ్రామసడక్ యోజన, అంత్యోదయ, స్వచ్ఛభారత్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమావేశంలో చర్చ జరుగుతుందని, సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

'ఉపాధి' భోక్తలపై క్రిమినల్ కేసు

కలువాయి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్నగోపవరంలో ఉపాధి హామీ పథకం అమలులో అవినీతి, అక్రమాలకు బాధ్యులైన ఆరుగురు సిబ్బందిపై కలువాయి పోలీస్‌స్టేషనులో క్రిమినల్ కేసు నమోదయ్యింది. వీరిపై ఎమ్పీడీవో డీవీ.నరసింహారావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రసహాయకుడు ఆదిరెడ్డి మహేంద్రరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ పి.బాబు రాజేష్, సాంకేతిక సహాయకులు ఆర్.ప్రసన్న, ఎంవీ.ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ (ఇన్‌చార్జ్) జే.శీనయ్యలపై ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరుల కుటుంబాల జాబ్‌కార్డులలో గ్రామానికి సంబంధం లేని 148 మంది ఇతరుల పేర్లు చేర్పించి బోగస్ మస్టర్లు వేసి ప్రభుత్వ ధనం రూ.25.5 లక్షలు దుర్వినియోగం చేశారంటూ క్షేత్రసహాయకుడు, కంప్యూటర్ ఆపరేటర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు. అదేవిధంగా జరిగిన పనుల్లో బోగస్ కొలతలు వేసి రూ.32.87 లక్షలు దుర్వినియోగానికి కారణమైన సాంకేతిక సహాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై కూడా ఎఫ్ఐఆర్ కట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉపాధి పథకంలో అక్రమాలు అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. రూ.1 లక్ష మించి అవినీతి జరిగితే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో ఎన్నడూలేనంతగా చిన్నగోపవరంలో అవినీతి, అక్రమాలు జరిగాయి. గ్రామస్థులు ఫిర్యాదు మేరకు అంబుడ్స్ పర్సన్ విచారణలో వెలుగుచూసింది. అనంతం జరిగిన సోషల్ ఆడిట్‌లో అక్రమాలు నిర్ధారించారు. గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ విజిలెన్స్ అధికారి భవానీ హర్ష ఆదేశాల మేరకు భోక్తలపై వేగంగా చర్యలు తీసుకుంటున్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్పీడీవో నరసింహారావు

● జిల్లాలో ఒక స్కూలుకూ దక్కని ఫైవ్‌స్టార్ రేటింగ్ ● 13 పాఠశాలలకు సున్నా రేటింగ్ ● నామమాత్రంగానే మౌలిక సదుపాయాలు

● వైసీపీ పాలనలో దెబ్బతిన్న విద్యా ప్రమాణాలు ● మెరుగుపరిచేందుకు కార్యాచరణ

'స్టార్' లేని చదువులు

'పాఠశాల విద్యను మేం బలోపేతం చేశాం. నేడు-నేడు పథకం ద్వారా స్కూలు భవన రూపురేఖలే మార్చేశాం. మేం తీసుకున్న మెరుగైన విద్యా ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు వచ్చాయి.' నాటి వైసీపీ పాలకులు చెప్పిన మాటలివి. అయితే, ఆచరణలో ఇవన్నీ బుడగలేనని తేలిపోయాయి.

ప్రభుత్వ బడులు పూర్తిగా వెనుకబడి పోయినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. గత వైసీపీ పాలనలో నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చేసిన ప్రచారం అంతా ఆర్భాటమేనని స్పష్టమైంది. కొన్ని పాఠశాలల్లో సదుపాయాలు ఉన్నా అభ్యసనా సామర్థ్యాలు లేక ఫలితాల్లో చతికిలపడ్డాయి. ఇంకొన్ని పాఠశాలల్లో ఫలితాలు ఉన్నా సౌకర్యాలు మాత్రం లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. పాఠశాల విద్యాశాఖ ఇటీవల చేపట్టిన అధ్యయనంలో జిల్లాలో ఒక్క పాఠశాల కూడా ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. ప్రాథమిక విభాగంలో 5 పాఠశాలలు, ఉన్నత విభాగంలో 7 పాఠశాలలకు సున్నా రేటింగ్ వచ్చిందంటే ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. దీనిపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు కార్యచరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణాయాలు పాఠశాలలను దయనీయస్థితిలోకి నెట్టేశాయి. నాడు-నేడు పేరుతో ప్రజాధనాన్ని దోచిపెట్టి పనులను మాత్రం అసంపూర్తిగా వదిలేశారు. అత్యధిక పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోగా, మరికొన్ని పాఠశాలల్లో అభ్యసనా సామర్థ్యాలు పూర్తిగా పడిపోయాయి. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాల విద్యాశాఖ చేపట్టిన అధ్యయనంలో ప్రభుత్వ పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు తెలుసుకునేందుకు మౌలికసదుపాయాలు, అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి స్టార్ రేటింగ్‌లను ప్రకటించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకుని ఒకటి నుంచి ఐదు స్టార్‌ల వరకు రేటింగ్ ఇచ్చారు. తక్కువ స్టార్స్ సాధించిన పాఠశాలలపై దృష్టి సారించి వాటి అభివృద్ధికి సూచనలు చేస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు, 'పది'లో ఉత్తీర్ణత, 1 నుంచి 9వతరగతి వరకు విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా అకడమిక్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అలాగే మరుగుదొడ్లు, విద్యుత్, డిజిటల్ తరగతులు, ప్రహరీలు, మంచినీరు, ఫర్నిచర్, తరగతి గదులు, లైబ్రరీ తదితర సౌకర్యాలను ప్రామాణికంగా తీసుకుని రేటింగ్ కేటాయించారు.

● మరీ ఇంత దారుణమా!?

జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 2,602 వరకు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కదానికి కూడా రెండు విభాగాల్లోనూ ఫైవ్‌స్టార్ రేటింగ్ దక్కలేదు. మౌలిక సదుపాయాల విషయంలో ప్రాథమిక పాఠశాలలు 218, ప్రాథమికోన్నత పాఠశాలలు 2, ఉన్నత పాఠశాలలు 2 కలిపి మొత్తం 222 పాఠశాలలు మాత్రమే పర్వాలేదన్నట్లు ఫోర్ స్టార్స్ లభించాయి. ప్రాథమిక విభాగంలో 892 పాఠశాలలకు 3 స్టార్, 880 పాఠశాలలకు 2 స్టార్, 76 పాఠశాలలకు 1 స్టార్ రేటింగ్ దక్కగా, ఒక్క పాఠశాలకు మాత్రం జీరో రేటింగ్ వచ్చింది. అలాగే ప్రాథమికోన్నత విభాగంలో 121 పాఠశాలలకు 3 స్టార్, 73 పాఠశాలలకు 2స్టార్, ఒక్క పాఠశాలకు 1స్టార్ రేటింగ్ లభించింది. ఉన్నత విభాగంలో 141 పాఠశాలలకు 3స్టార్, 190 పాఠశాలలకు 2 స్టార్, ఐదు పాఠశాలలకు 1 స్టార్ రేటింగ్ దక్కింది. అభ్యసనా సామర్థ్యాల విషయంలో జిల్లాలో ఒక్క పాఠశాలకు కూడా 5స్టార్ కాదు కదా.. 4 స్టార్ రేటింగ్ కూడా దక్కలేదు. ప్రాథమిక విభాగంలో 173 పాఠశాలలకు 3స్టార్, 1314 పాఠశాలలకు 2స్టార్, 575 పాఠశాలలకు 1 స్టార్ రేటింగ్ దక్కించుకున్నాయి. ప్రాథమికోన్నత విభాగంలో ఒక్క పాఠశాలకు 3స్టార్, 116 పాఠశాలలకు 2 స్టార్, 80 పాఠశాలలకు 1స్టార్ రేటింగ్ లభించాయి. ఉన్నత

- మిగతా 6లో..

విద్యా శాఖ అధ్యయనంలో నమ్మలేని నిజాలు వెలుగులోకి

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం



ఉదయగిరి : గండిపాళెంలోని పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. 'దీంతో ఓ దాత సహకారంతో అద్దెభవనంలో పాఠశాల నడుస్తోంది.



మర్రిపాడు : పొంగూరు హైస్కూలులో అర్ధంతరంగా ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం




సంగం హైస్కూల్లో అసంతపూర్తిగా ఉన్న 'నాడు-నేడు' భవన నిర్మాణ పనులు

నైపుణ్యం కట్టుకోండి!

● జిల్లాలో కానరాని నైపుణ్య గణన

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాల్లో ఒకటైన నైపుణ్య గణన జిల్లాలో తూతూ మంత్రంగా మారింది. దీనికి డిస్ట్రిక్ట్ స్కిల్ కమిటీస్ (డీఎస్‌సీ) సమా వేశాల నిర్వహణే నిదర్శనం. 2024-25 సంవత్సరానికి సంబంధించి నెలకొకటి వంతున జిల్లాలో 12 సమావేశాలు జరగాల్సి ఉండగా మొన్నటి వరకు ఒకే ఒక్క సమావేశం నిర్వహించడం గమనార్హం. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లాకు సంబంధించి 'నైపుణ్య' సమావేశాల అంశమై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో జిల్లా అధికారులు ఆఘమేఘాల మీద విజయవాడ నుంచి నెల్లూరుకు వచ్చి రెండో సమావేశాన్ని అత్యవసరంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా జిల్లాలో నిర్వహించటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





శిక్షణ కార్యక్రమాలు జరిగాయి

నైపుణ్య గణనకు సంబంధించి సచివాలయ సిబ్బందికి, ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతి నెలా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. జిల్లాలో నైపుణ్య కమిటీ సమావేశాలు ప్రతి నెలా జరగడం లేదు. మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నాం.

- అబ్దుల్ ఖయ్యూం, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి

● నవంబరు 1 నుంచి ప్రారంభించాలి
● నేటికీ మొదలుకాని వైనం
● మరోవైపు పారిశ్రామిక పరుగులు
● ఎంతో మంది ఉద్యోగులు అవసరం
● అయినా యువతకు శిక్షణ, ఉపాధి కరువు
● తూతూ మంత్రంగా జిల్లా స్కిల్ కమిటీస్ సమావేశాలు
● నెలకొకటి జరగాల్సి ఉంటే.. ఇప్పటికి జరిగింది ఒక్కటే!
● కలెక్టర్ల సమావేశంలో సీఎం సీరియస్
● ఇప్పటికైనా మెరుగుపడేనా?!
● త్వరగా పూర్తి చేయాలని నిరుద్యోగుల వేడుకోలు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కు వివిధ నైపుణ్య రంగాలలో శిక్షణ ఇప్పిస్తే వారికి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టింది. తొలుత మంగళగిరిలో గణన చేపట్టగా అది విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్యగణన చేపట్టాలని నిర్ణయించింది. దీని నిర్వహణపై సచివాలయాలు, ఇతర శాఖల సిబ్బందికి శిక్షణ ఇచ్చింది. జిల్లాలో నవంబరు 1 నుంచి నైపుణ్య గణన ప్రారంభం కావాల్సి ఉన్నా ఇప్పటికీ ఆ దాఖలాలు లేవు.

● 15 నుంచి 59 ఏళ్ల వారికి..

నైపుణ్యం అనే ప్రత్యేక యాప్ ద్వారా ఇంటింటా నైపుణ్య గణనను నిర్వహించనున్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది జనాభా లెక్కల మాదిరిగానే ఈ నైపుణ్య గణన చేస్తారు. దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్ర ప్రభుత్వం ఈ గణనకు సిద్ధమైంది. నిరుద్యోగులు ఏమి చదువుతున్నారు. ఏ పని చేయగలరు, వారి నైపుణ్యాలు ఏమిటి, అన్న వివరాలు నమోదు చేస్తారు. ఇందుకోసం 15 నుంచి 59 ఏళ్ల వయసున్న వారి వివరాలు సేకరిస్తారు. ప్రతి ఒక్క కుటుంబంలోని ప్రతి ఒక్కరి విద్యార్హతలు, నైపుణ్య వివరాలు నమోదు చేస్తారు. టెన్త్ ఫెయిల్, పాస్ అయినా, ఐటీఐ అయితే దానిలోని ట్రేడ్లు, బీఏ, బీకాం, బీఎస్సీ, బీటెక్ అయితే అందులోని బ్రాంచిల వివరాలతో సహా సమాచారం సేకరిస్తారు. ప్రస్తుతం తక్కువ ఆదా యం పొందుతున్నవారి ఆదాయాన్ని పెంచేందుకు నైపుణ్య శిక్షణ ఇస్తారు. గణన వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తారు.

● పరిశ్రమల అవసరాల గుర్తింపు

జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతోంది. రాష్ట్రం కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తోంది. ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు తోడు, కొత్తవాటికి భారీగా ఉద్యోగులు అవసరం. అయితే ఇప్పటి వరకు జిల్లాలో ఆ దిశగా పూర్తిస్థాయిలో చర్యలు కరువయ్యాయి. ఈ క్రమంలో నైపుణ్య గణన పూర్తయిన తరువాత కంపెనీలు, పరిశ్రమలు ఎలాంటి నైపుణ్యాలు కోరుకుంటున్నాయో ప్రభుత్వం గుర్తిస్తుంది. నిరుద్యోగులకున్న నైపుణ్యాలను, పరిశ్రమల అవసరాల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి తగిన శిక్షణ ఇస్తారు. ఈ 'గణన' వల్ల జిల్లాలో ఎంత మంది నిరుద్యోగులు ఉన్నారు?, వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలి? వంటి అంశాలపై ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది. ఈ నైపుణ్య శిక్షణకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్‌ను కూడా ఉపయోగించుకోనున్నారు. ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, ఐటీ సెక్టార్, వ్యవసా యం, బ్యూటీ వెల్‌నెస్, ఇంటి పనివాళ్లు, ఆహార పరిశ్రమ సామర్థ్యం, ఫర్నిచర్, ఫిట్టింగ్, పవర్ సెక్టార్ వంటి అన్నీ రంగాల్లోనూ నైపుణ్య శిక్షణకు సంబంధించిన మెటీరియల్ ఇస్తారు. సర్వే పూర్తయిన తరువాత ప్రత్యేక నైపుణ్య శిక్షణ ప్రణాళికలను రూపొందిస్తారు. ఈ మేరకు విద్యార్థులకు విద్యాసంస్థల్లో నైపుణ్యాలు అందించనున్నారు. ఇందుకోసం బీటెక్, డిగ్రీ సిలబస్‌లో అవసరమైన మార్పులు చేయాలని యోచిస్తున్నారు. నిరుద్యోగు లకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి నైపుణ్యాలు అందిస్తారనే దానిపై కూడా అధ్యయనం చేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న కార్యక్రమంపై అధికార యంత్రాంగం శ్రద్ధ వహించకపోవ డంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్కిల్ డెవలప్‌మెంటు కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి, సర్వేను త్వరగా పూర్తి చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

సహకార సంఘాల్లో ప్రత్యేకాధికారుల పాలనే..!

మరో ఆరు మాసాలు పొడిగింపు ● ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే!

● ఆశావహుల నిరాశ

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సహకార సంఘాలకు ప్రత్యేకాధికారుల పాలనా కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రైతులకు ఎరువులు, పురుగు మందులు సరసమైన ధరలకు అందించడానికి, పరపతి సౌకర్యం కల్పించడానికి, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు, విత్తనాలు తక్కువ ధరలకు అందించడానికి జిల్లాలో సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. 1964 సహకార సంఘాల చట్టం ప్రకారం అవి నడుస్తున్నాయి.

ప్రస్తుతం జిల్లాలో 78 సహకార సంఘాలున్నాయి. వాటికి 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగి పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి. 2018 ఫిబ్రవరి లో మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, నాటి టీడీపీ ప్రభుత్వం వాయిదా వేసింది. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అప్పటి వరకు సహకార సంఘాలకు ఉన్న పాలకవర్గాలను రద్దు చేసింది. వాటి స్థానంలో సంఘాలకు త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసి తమకు అనుకూలమైన వారిని వాటిలో నియమించింది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు త్రిసభ్య కమిటీలే కొనసాగాయి. ఎన్నికలు జరుగుతాయని ఎప్పటికప్పుడు అనుకున్నా, వాయిదా పడుతూ వచ్చాయి. ఎన్నికలు జరగ కపోగా, సహకార సంఘాల పనితీరు మందగించింది. పలు సంఘాల్లో నాయకులు నిబంధన లకు విరుద్ధంగా ఉద్యోగనియామకాలు చేపట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నిధులను కూడా ఇష్టారీతిన వినియోగించి సంఘాలు ఆర్థికంగా దెబ్బతినటా నికి కారకులైనారనే విమర్శలు వచ్చాయి. అయితే కొందరు మాత్రం ప్రతిష్టాత్మకంగా పనిచేసి సొసైటీల పనితీరును మెరుగుపరచి వాటికి మంచి పేరు తీసుకుని వచ్చారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సహకార సంఘాల త్రిసభ్య కమిటీలకు నాయకత్వం వహిస్తున్నవారు రాజీనామా చేశారు. త్రిసభ్య కమిటీలను రద్దు చేసిన ప్రభుత్వం సహకార శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులను ఆ సంఘాలకు ప్రత్యేకాధికారు లుగా నియమించింది. వారు ఆయా సంఘాల పనితీరును మెరుగుపరుస్తూ, ఎన్నికలు జరుగుతాయని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. సంఘాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేస్తున్నారు. సంఘాల్లో ఓటర్ల జాబితాను కూడా సిద్ధం చేస్తున్న తరుణంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేకా ధికారుల పాలనా కాలం పొడిగించడం విశేషం. దీంతో ఎన్నికలు జరుగుతాయని ఎదురు చూసిన ఆశావహుల ఆశలు అడియాశలయ్యాయి.



ఇది ఇంతేనా!?

వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లెలో అటవీ శాఖ సిబ్బంది క్వార్టర్స్ వినియోగంలో లేక శిథిలావస్థకు చేరాయి. సిబ్బంది ఇక్కడ నివాసం లేకపోవడంతో చుండి సెక్షన్ పరిధిలోని అయ్యవారిపల్లె, మాలకొండ, చుండి రామ లింగాపురం గ్రామాల్లోని అటవీ సంపద అక్రమంగా తరలిపోతోంది. 30 ఏళ్ల కిందట ఇక్కడ ఫారెస్టు సిబ్బంది కోసం రూ.లక్షలు వెచ్చించి అన్ని సౌకర్యాలతో ప్రభుత్వం భవనాలు నిర్మించింది. నాలుగైదేళ్ల ఫారెస్టర్, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్, గార్డ్ తదితర సిబ్బంది ఇక్కడే కాపురం ఉండేవారు. ఆ తర్వాత వాళ్లు పట్టణాలకు వెళ్లిపోవడంతో భవనాలు నిరుప యోగంగా మారాయి. అక్రమా ర్కులు రాత్రిళ్లు అక్రమంగా అడవు ల్లో కలపను నరికివేసి పొగాకు బ్యారనీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- వలేటివారిపాళెం, (ఆంధ్రజ్యోతి)



ప్రైవేట్ కళాశాలల గుర్తింపునకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నడుస్తున్న అన్నీ ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి అఫిలియేషన్, రెన్యువల్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలల యాజమాన్యాలు అదనపు సెక్షన్లు, కోర్సులతోపాటు ద్వితీయ భాషను, మీడియంను, ప్రదేశాన్ని, మేనేజ్‌మెంట్‌ను కూడా మార్చుకోవచ్చన్నారు. అలాగే ఏదైనా కళాశాల మూసివేయడానికి, పునః ప్రారంభించడానికి, ఎఫ్‌డీఆర్‌ను విడుదల చేసుకునేందుకు కూడా ఇంటర్‌బోర్డు అవకాశం కల్పిస్తోందని తెలిపారు. జిల్లాలోని కళాశాలల యాజమాన్యాలు సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్ అఫిలియేషన్ మేనేజ్‌మెంట్ (ఓఏఎంఎస్) ద్వారా 2025 ఫిబ్రవరి 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో గుర్తింపు రెన్యువల్ చేసుకోనటువంటి కళాశాలలు కూడా ఏడాదికి రూ.50వేలు చొప్పున చెల్లించి రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. కండిషనల్ గుర్తింపు పొందిన కళాశాలలు 3 నెలల్లో లోటుపాట్లను సరిచేసుకుని సంబంధిత ధ్రువపత్రాలను అందచేయాలని, లేనిపక్షంలో నిర్ణీత గడువు తరువాత రూ.50వేలు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దరఖాస్తు చేసిన కళాశాలలను తనిఖీ కమిటీ సందర్శించి అందించే నివేదికల ఆధారంగా అనుమతులు మంజూరు చేస్తారన్నారు. బోర్డు నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా కళాశాలలు అదనపు సెక్షన్లు నిర్వహించినా, ప్రవేశాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హమ్మయ్య.. తెప్పించారు!



రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంచామని రైతులెవ్వరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఎస్‌వీఆర్ సహకార సంఘంలో 'యూరియా స్టాక్ అయిపోయింది' అనే వార్తపై ఆయన స్పందించి సహకార సంఘాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. వారం రోజులుగా యూరియా అందుబాటులో లేని విషయం నిజమేనని చెప్పారు. ఈ క్రమంలో ఒక్కసారిగా రైతులు తొందర పడడంతో సమస్య ఏర్పడిందని చెప్పారు. ఇపుడు అవసరం అయినంత తెప్పించామని కావాల్సిన రైతులు కేంద్రాలకు వెళ్లి తెచ్చుకోవాలని సూచించారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)



పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, ఏపీఎంఐపీ, మార్కెటింగ్ శాఖల అధికారులు

మామిడి బీమాను సద్వినియోగం చేసుకోండి

- ప్రీమియం చెల్లింపునకు నెలాఖరు వరకు గడువు
- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో పంట నష్టం వాటిల్లితే రైతులను ఆదుకునేందుకు రబీ సీజన్‌కు సంబంధించి మామిడి పంటకు రాష్ట్ర ప్రభుత్వం బీమా సదుపాయాన్ని కల్పించిందని, సాగుదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. మామిడి పంట వాతావరణ ఆధారిత బీమా పథకం పోస్టర్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎకరాకి బీమా మొత్తం రూ.45వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. మీసేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, బ్యాంకుల్లో ఈ నెల 31వతేదీలోపు రూ.2250 ప్రీమియం చెల్లించి పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, మత్స్య శాఖ జేడీ నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, మార్కెటింగ్‌శాఖ ఏడీ అనిత తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా సమాధానం చెప్పాలి

- అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం నెల్లూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగానే దేశంలోని అన్నీ వ్యవస్థలు నడుచుకుంటున్నాయన్నారు. అలాంటి వ్యక్తిపై విమర్శలు చేయటం దారుణమన్నారు. అమిత్ షా తక్షణమే జాతికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, సంజయ్ కుమార్, మల్లికార్జునరెడ్డి, అల్లాఉద్దీన్, మోహన్, శ్రీరాములు, పప్పర్తి గణేష్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

యూరియా.. ఏదయ్యా!

- ఎరువుల కోసం అన్నదాతల గగ్గోలు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు

కోవూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా అందించడంలో వ్యవసాయ శాఖ సరైన విధానం అమలు పరచలేకపోతోంది. దీంతో రైతులు సొసైటీలు, దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. వరి నాట్లు పూర్తయిన వెంటనే వాతావరణం బాగుంటే రోజుల వ్యవధిలోనే యూరియాతోపాటు డీఏపీ వంటి ఎరువులను పొలాల్లో చల్లుతుంటారు. అయితే, ఈసారి ఎరువుల దిగుమతిలో కొంత ఆలస్యం అయ్యింది. సాధారణంగా వరినాట్లకు ముందుగానే జిల్లాలోని రైతాంగానికి సరిపడినంత యూరియాను దిగుమతి చేసుకోవాలి. ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణంలో మార్పు కారణంగానే గోదాములకు యూరియా చేరడం ఆలస్యమైంది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. యూరియా దక్కదేమోనన్న ఆందోళనతో కొందరు రైతులు అవసరానికి మించి ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. ఇదే అదునుగా దుకాణాల యజమానులు కూడా యూరియా కావాలంటే డీఏపీ వంటి ఎరువులు, క్రిమిసంహారకాలు కొనుగోలు చేయాలనే నిబంధన విధించారు. కొన్నిచోట్ల యూరియాను రహస్య ప్రాంతాల్లో దాచి కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించాలని పథకం పన్నారు. ఇది పసిగట్టిన వ్యవసాయ శాఖ అధికారులు దాడులు చేయడంతో వ్యాపారులు యూరియాను దాచాలనే ఆలోచన విరమించారు.



బుచ్చిరెడ్డిపాళెం : వవ్వేరు బ్యాంకులో యూరియా కట్టల కోసం ఎగబడుతున్న రైతులు

'వవ్వేరు'లో రైతుల్లో ఆగ్రహం

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి) : వవ్వేరు కోఆపరేటివ్ రూరల్ బ్యాంకులో ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు నిరీక్షిస్తే 1 కట్ట యూరియా దొరకడం గగనంగా మారింది. శుక్రవారం వవ్వేరు బ్యాంకు అధికారులు వ్యవహరించిన తీరు రైతులను ఆగ్రహానికి గురిచేసింది. సిఫారసు ఉన్న వాళ్లకే యూరియా కట్టబెట్టి తమను ఇబ్బందులకు గురిచేస్తే కలెక్టర్ దగ్గరకే వెళ్తామని రైతులు హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి వెంటనే అక్కడకు చేరుకుని ఎకరాకు ఒక కట్ట లెక్కన యూరియా పంపిణీ చేశారు. 5 కట్టలకు పైబడి అవసరమైన వారికి పాసుపుస్తకాలు పరిశీలించి పంపిణీ చేశారు.



సంగం : వ్యవసాయ కార్యాలయానికి వచ్చిన యూరియాను ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న కూలీలు

నగదు చెల్లించిన యూరియా అందచేత

సంగం, (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సేవా కేంద్రంలో నగదు చెల్లించిన రైతులకు శుక్రవారం యూరియా సరఫరా చేశారు. డిమాండ్ ఏర్పడటంతో రూ.266 ఉన్న యూరియా ప్రైవేట్ మార్కెట్‌లో రూ.350లకు విక్రయిస్తున్నారు. అయినా లభ్యం కావడంలేదు. దీంతో కొందరు రైతులు రైతు సేవా కేంద్రంలో వారం రోజుల క్రితం యూరియా కోసం నగదు చెల్లించారు. ఆ మేరకు 400 బస్తాల యూరియాను నగదు చెల్లించిన రైతులకు అందచేశారు.

రైతులందరికీ సరఫరా చేస్తాం

కోవూరు మండలం పడుగుపాడు సొసైటీలో 36 టన్నుల యూరియా నిల్వ ఉంది. ప్రభుత్వ ధరలకే విక్రయిస్తున్నాం. మరో 60 టన్నుల యూరియా రెండు రోజుల్లో రానుంది. కొందరు వ్యక్తులు పనిగట్టుకుని కొరత సృష్టించాలని చూశారు. వారి కుట్రను వ్యవసాయశాఖాధికారులు పసిగట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చేశారు.

- కొండూరు గోవర్దనరెడ్డి, సీఈఓ, పడుగుపాడు సొసైటీ



కోవూరు : యూరియా మోసుకెళ్తున్న కూలీ

భూముల రీ సర్వేకు పిడూరు ఎంపిక

- 24 నుంచి ప్రారంభం

మనుబోలు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చాక తొలిసారిగా భూముల రీసర్వేకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలో పిడూరు రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ గ్రామంలో ఈనెల 24వ తేదీ నుంచి రీసర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పిడూరులో 3 నెలల పాటు రీసర్వే ప్రక్రియ జరుగుతందన్నారు. మండలంలో 18 రెవెన్యూ గ్రామాలు ఉండగా 14 గ్రామాల్లో మాత్రమే గతంలో రీసర్వే జరిగిందన్నారు. ఫిబ్రవరి తరువాత ఎన్నికల కోడ్ రావడంతో రీసర్వే నిలిచిపోయిందన్నారు. పిడూరులో 498 సర్వే నెంబర్లలో 4,810 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూములు ఉన్నాయన్నారు. అందులో మెట్ట భూములు 1,905 ఎకరాలు, మాగాణి భూములు 1,771 ఎకరాలు, ప్రభుత్వ భూములు 1056 ఎకరాలు ఉన్నాయన్నారు. అలాగే గ్రామనత్తం 62, ఇనాం భూములు 14 ఎకరాలు ఉన్నాయన్నారు. ఈ గ్రామంలో రీసర్వే పూర్తయిన తరువాత ప్రభుత్వ ఆదేశాలతో మిగిలిన మనుబోలు, మడమనూరు, వడ్లపూడి గ్రామాల్లో రీసర్వే చేపడుతామని తెలిపారు.



తహసీల్దారు సుబ్బయ్య

పోక్సో కేసులో నలుగురికి పదేళ్ల జైలు

నెల్లూరు, (లీగల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను ప్రేమించానని నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తితోపాటు అందుకు సహకరించిన మరో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన దండోలు సుబ్బారావు అలియాస్ సుబ్బు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన 10వ తరగతి చదువుతున్న బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి తనతో తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడికి తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిక మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన కోగిలి సుబ్రహ్మణ్యం, ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన ఎల్లంటి వెంకటయ్య, బాలాయపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన మంగుళూరు వాణి సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓజిలి పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులు ఒక్కొక్కరికి పదేళ్లు చొప్పున జైలు శిక్ష, 22 వేల రూపాయల వంతున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

స్టార్‌లేని చదువులు

(5వ పేజీ తరువాయి)

విభాగంలో 2 పాఠశాలలకు 3స్టార్, 33 పాఠశాలలకు 2స్టార్, 296 పాఠశాలలకు 1స్టార్ రేటింగ్ లభించాయి.

- 12 పాఠశాలలకు సున్నా రేటింగ్

జిల్లాలో ప్రాథమిక విభాగంలో 5 పాఠశాలలకు, ఉన్నత విభాగంలో 7 పాఠశాలలకు మొత్తం 12 పాఠశాలలకు సున్నా రేటింగ్ లభించాయి. ప్రాథమిక విభాగంలో స్టోబీడీ కాలనీ, అంబాపురం, అంకుపల్లి మెయిన్, ఆర్‌వైజీ పాళెం, కుర్రపల్లి బీసీ ఎంపీపీఎస్ పాఠశాలలు సున్నా రేటింగ్ లభించింది. అలాగే ఉన్నత విభాగంలో అల్లూరుపేట, ఈస్ట్ గోగులపల్లి, నార్త్ మోపూరు, పట్టపుపాళెం, ఊటుకూరు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలకు, చంద్రశేఖరపురం ఈఎంఆర్ఎస్ పాఠశాల, యర్రగుంట బాలుర బీసీ వెల్ఫేర్ పాఠశాలలు సున్నా రేటింగ్ పొందాయి. ఈ పాఠశాలల్లో కనీస సదుపాయాలు, వసతులు కూడా లేకపోగా అభ్యసనా సామర్థ్యాలు, ఫలితాల్లో పూర్తిగా వెనుకబడినట్లు అధికారులు గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలకు విద్యారంగం నిర్వీర్యం కాగా కూటమి ప్రభుత్వం వీటిని సరిదిద్దేందుకు అవస్థలు పడుతోంది. త్వరలోనే అన్ని పాఠశాలల్లో స్టార్‌లను మెరుగుపరిచేందుకు ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఆచరణలో పెట్టేందుకు సన్నద్ధమవుతున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

భవిత కేంద్రాల్లో ఉత్తమ సేవలందించాలి

- డీఈవో డాక్టర్ బాలాజీరావు

నెల్లూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సిబ్బంది ఉత్తమ సేవలందించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్ బాలాజీ రావు సూచించారు. భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్న సహిత విద్య కార్యక్రమాలు, వాటి అమలు తీరుపై నెల్లూరులోని సుంకు చెంగన్న నగరపాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సదుపాయాలన్నీ పిల్లలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని అంశాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు ఎలా ఉపయోగించాలి, సమస్యలు ఏ విధంగా పరిష్కరించాలన్న అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. పింఛన్ సదుపాయాలు, యూడీఐడీ కార్డులను అందించడం, దివ్యాంగ విద్యార్థులకు ఆరోగ్య బీమా, ఉపకారవేతనాలకు సంబంధించిన అన్ని అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ మల్లికార్జున పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, కందుకూరు డిప్యూటీ ఈవో జాన కిరామ్, జిల్లా కోఆర్డినేటర్ పెంచలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో బాలాజీరావు

హైవేపై వాహనం ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఎన్టీఆర్ నగర్ సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు దుర్మరణం చెందింది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో షేక్ జైనుల్లా, మస్తానమ్మ(60) దంపతులు నివసిస్తున్నారు. గురువారం వారిద్దరూ వెంకటాచలం మండలం గురి విందపూడి గ్రామంలో జరిగిన మనుమరాలి సీమంతం వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం బైక్‌పై జాతీయ రహదారి మీదగా భగత్‌సింగ్‌కాలనీకి బయలు దేరారు. ఎన్టీఆర్ నగర్ సమీపంలో వెనుక నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. దీంతో దంపతులిద్దరు రోడ్డుపై పడ్డారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యే క్రమంలో రోడ్డుపై పడి ఉన్న మస్తానమ్మ పైనుంచి వాహనాన్ని పోనిచ్చాడు. దీంతో ఆమె తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో నార్త్‌ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శుక్రవారం జైనుల్లా ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ బలరామిరెడ్డి కేసు నమోదు చేశారు.

కూలీ నుంచి యువశాస్త్రవేత్తగా అశోక్

- కష్టపడి సంపాదించి ఫీజులు చెల్లించి విద్యాభ్యాసం
- తల్లిదండ్రులిద్దరూ దివ్యాంగులే..
- అయినా పట్టుదలతో ఉన్నతస్థాయికి..
- అమెరికాలో కేన్సర్‌పై పరిశోధనలు

ఆ యువకుడు మారుమూల గ్రామంలో పుట్టాడు... తల్లిదండ్రులిద్దరూ దివ్యాంగులే... పుస్తకాల కొనుగోలుకు కూడా డబ్బుల్లేవు... అయినా కృంగిపోలేదు... కూలి పనులకు వెళ్లి వచ్చిన సంపాదనతో చదువు సాగించాడు... అనుకున్నది సాధించాడు... ఆయన ప్రతిభకుతోడు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా లభించడంతో అమెరికాలో కేన్సర్‌పై పరిశోధనలు చేసి ఎన్నో అవార్డులు సాధించాడు. ఎంతోమంది ప్రశంసలు పొందాడు. ఆయనే పుట్టువారి పల్లెకి చెందిన యువశాస్త్రవేత్త చీమల అశోక్.

- ఏఎస్‌పేట, (ఆంధ్రజ్యోతి)



ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న యువ శాస్త్రవేత్త అశోక్

- పేదింటి నుంచి శాస్త్రవేత్త

ఏఎస్‌పేట మండలం రాజవోలు పంచాయతీ పుట్టువారిపల్లి గ్రామానికి చెందిన చీమల తిరుపాలు, నాగమ్మ దంపతులకు అశోక్,ఆనంద్ సంతానం. ఆ దంపతులు ఇంటి ఆవరణంలోనే చిల్లర దుకాణం పెట్టుకుని పిల్లలను చదివించేవారు. పెద్ద కుమారుడు అశోక్ చిన్నప్పటి నుంచి చదువులో రాణిం చేవాడు. ఏడో తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. ఆ తరువాత నుంచి చదువుల కోసం పక్కనున్న ఆత్మకూరుకు వెళ్లాల్సి రావడంతో కష్టాలు మొదల య్యాయి. ఫీజులు,పుస్తకాలకు డబ్బులు లేక, సెలవు ల్లో కూలి పనులకు వెళ్లేవాడు. అలా వచ్చిన నగదుతో చదువు సాగించాడు. ఎలాగో 10వ తరగతి పూర్తి చేసి వింజమూరులో ఇంటర్ చేరా డు. ఎండకాలం సెలవుల్లో బెంగళూరుకి వెళ్లి బేల్దారి పనులు చేశాడు. కూలి పనులు చేస్తూనే 2008లో తిరుపతి ఎస్వీయూ బీఎస్సీ చదివి ఫస్ట్‌ర్యాంక్ సాధించాడు. 2010లో బెంగళూరు యూనివర్సిటీలో ఎంఎస్సీలోనూ మొదటి ర్యాంక్ సాధించాడు.

- ఆసరాగా ఉపకార వేతనం

అదే ఏడాది స్టూడెంట్ మెరిట్ అవార్డు పొంది ప్రభుత్వం నుంచి నెలకు రూ. 40వేలు ఉపకార వేతనం పొందారు. 2012లోనూ జాతీయ స్థాయిలో పరీక్ష రాసి ప్రభుత్వం నుం చి నెలకు రూ. 70వేల ఉపకార వేతనంతో కేన్సర్ బయా లజీలో పీహెచ్‌డీ చేశారు. ఆయన ప్రతిభను గుర్తించి 2020లో అమెరికాలోని సెంటర్ ఫర్ వ్యాస్కులర్ బయాలజీ యూ కాన్ హెల్త్ కనెక్టికట్ వారు ఏడాదికి రూ. 40లక్షల ఫెలోషిప్‌తో శాస్త్రవేత్తగా శిక్షణకు అవకాశం కల్పించారు.

- అవార్డులు, ప్రశంసలు

బ్రెస్ట్ కేన్సర్‌లో ఎన్నో పరిశోధనలు చేసి తక్కువ ఖర్చుతో వ్యాధి నివారణకు ఉన్న అవకాశాలను కనుగొన్నారు. దీంతో ఆయన ఎన్నో అవార్డులు, ప్రశంసలు పొందారు. అల్జీమర్ వ్యాధిపై కూడా పరిశోధనలు చేశారు. 2013లో న్యూయార్క్‌లో నిర్వహించిన సదస్సులో సుమారు 34 దేశాల 685 మంది శాస్త్ర వేత్తలు పాల్గొన్నారు. వారంతా 200 పరి శోధన పత్రాలను సమర్పించగా, అందులో నాలుగు పత్రా లకు అవార్డులు రాగా, అందులో ఒకటి అశోక్ కావడం విశేషం.

పట్టుదలతో శ్రమిస్తే విజయమే..

పట్టుదల ఉండి, లక్ష్యం కోసం శ్రమిస్తే ఎవరైనా విజయం సాధిం చవచ్చు మట్టిలో లభించే వజ్రాన్ని సానపెట్టినప్పుడే దాని విలువ పెరుగుతుంది. అలానే కష్టాలను అధిగమించి ముందుకు సాగినప్పుడే మన ప్రతిభ అందరికీ తెలుస్తుంది. గ్రామాల్లోని యువకులు వజ్రాల వంటివారు. వారిలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సాహిస్తే ఎలాంటి విజయాలను అయినా సాధిస్తారు.

- యువశాస్త్రవేత్త అశోక్

వక్ఫ్ భూముల లెక్క తేల్చండి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జిల్లాల వారీగా అన్యాక్రాంతమైన వక్ఫ్ భూముల లెక్కలు తేల్చాలని వక్ఫ్ బోర్డు అధికారులను ఆ బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆదేశించారు. నెల్లూరులోని ఆయన కార్యాలయం నుంచి శుక్రవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవో, 26 జిల్లాల ఇన్‌స్పెక్టర్లు, ఆడిటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్లు నిజాయ తీగా పనిచేయాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల న్నింటినీ రికార్డుల్లో పొందుపరచాలని సూచించారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ప్రమోషన్ సీనియారిటీ జాబితా

నెల్లూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నగరపాలక, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు, సమాన కేడర్ కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు సీనియారిటీ జాబితా ను సిద్ధం చేసినట్లు డీఈవో బాలాజీ రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబితా విద్యాశాఖ వెబ్‌సైట్ deonellore.50webs.comలో పొందుపరిచినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు ఈ జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలుంటే శనివారం మధ్యాహ్నం 3 గంటల్లోపు తగిన పత్రాలతో రాతపూర్వకంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందచేయాలని కోరారు.



'గీతా' వైభవం

గీతా వైభవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరులోని అష్టలక్ష్మీ ఆలయం లో ఉన్న ధ్యాన మందిరంలో శుక్రవారం భగవద్గీతా జయంతి వేడుకలు జరిగాయి. గీతా వైభవమే భారత వైభవమని బీజేపీ నాయకుడు పీ సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. దాదాపు 2వేల మంది విద్యార్థులు, గురు వులు భగవద్గీత శ్లోకాలను పఠించడం గొప్ప విషయమని కొనియాడారు. ప్రతీ ఇంట భగవద్గీత గానం చేయాలని పిలుపు నిచ్చారు. ట్రస్ట్ అధ్యక్షుడు నజీర్ బాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చివరగా విద్యార్థులు, నిర్వాహకులు, అతిథులు కలిసి మహా నగర సంకీర్తన నిర్వహించారు. పార్టీలకు అతీతంగా నాయకులు పాల్గొన్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)

కోనలో గోదాదేవికి క్షేత్రోత్సవం



రాపూరు మండలం పెంచలకోన క్షేత్రంలో ధనుర్మాస సందర్భంగా శుక్రవారం గోదాదేవికి విశేష పూజలు, క్షేత్రోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా అమ్మ వారికి విశేష అలంకరణ చేసిన ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలను ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

భూ ఆక్రమణదారుల భరతం పడతాం!

- సీఎం ఆదేశాలతో ఆ భూమిని పేదలకు పంచుతాం
- వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

రాపూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని విచ్చలవిడిగా భూ ఆక్రమణలు జరిగాయని, వారిని వదిలే ప్రసక్తే లేదని వెంటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తీవ్ర విమర్శలు చేశారు. రాపూరు సమీపంలోని చెన్ను గార్డెన్స్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాపూరు మండలం సంక్రాంతిపల్లిలో వైసీపీ నాయకుడు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి సుమారు 100 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. కబ్జా చేసిన భూమిలో రైతులకు నీరు అందించే పిన్నేరువాగును కూడా కొంతమేర ఆక్రమించారని విమర్శించారు. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సర్వే చేపట్టి భూమిని పేదలకు తిరిగి అందిస్తామని హామీ ఇచ్చారు. భూములను కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నాయకులు ఎక్కడపడితే అక్కడ అక్రమంగా, దౌర్జన్యంగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం తప్పు చేసిన ప్రతి ఒక్కరికి శిక్ష పడేలా చేస్తుందని హెచ్చరించారు. మండలంలో కొంతమంది ఇదే బాటలో ఉన్నారని త్వరలో వాళ్ల బండారం కూడా బయటపెడతామని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్‌వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లయ్యింది... బకాయిలివ్వరా?!

- జీజీహెచ్‌లో సెక్యూరిటీ సిబ్బంది ఆవేదన
- 2019 నుంచి మూడు నెలల జీతం పెండింగ్
- అప్పటి వేతనాల కోసం 100 మంది ఎదురుచూపు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి జీతం బకాయిలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్ల క్రితం సెక్యూరిటీ సిబ్బందికి మూడు నెలలు వేతనాలు చెల్లించలేదు. ఆ బకాయిల చెల్లింపునకు ఇటీవల నిధులు విడుదలైనా వాటిని సిబ్బందికి ఇవ్వకుండా దారిమళ్లించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆ చిరుద్యోగులు లబోదిబోమంటున్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 100 మంది, వైద్య కళాశాలలో 24 మంది, నర్సింగ్ కళాశాలలో 10 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. 2019లో తిరుపతికి చెందిన బాలాజీ సెక్యూరిటీ ఏజెన్సీస్ ఈ సెక్యూరిటీల నిర్వహణ చేపట్టేది. అదే ఏడాది సెప్టెంబరు నెలతో ఆ ఏజెన్సీ కాంట్రాక్ట్ పూర్తయింది. అయినా సెక్యూరిటీ గార్డులు కొనసాగుతూనే ఉన్నారు. 2020లో సాల్మన్ ఏజెన్సీకి సెక్యూరిటీ బాధ్యత నిర్వహణ బాధ్యత అప్పగించారు. ఈ క్రమంలో 2019వ సంవత్సరం అక్టోబరు, నవంబరు, డిసెంబరు మాసాలకు సంబంధిం చి ఏ ఏజెన్సీ సెక్యూరిటీ బాధ్యతలు అప్పగించ లేదు. దీంతో ప్రభుత్వమే వీరి వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఒక్కొక్కరికి రూ.8600 చొప్పున చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిల చెల్లింపునకు 2020, 2021లో నిధులు విడుదలయ్యాయి. అయితే వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న వారికి మాత్రమే బకాయిలు చెల్లించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న 100 మంది సెక్యూరిటీలకు వేతన బకాయిలు అందలేదు. అప్పటి నుంచి వారు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదు.



జీతం బకాయిలు చెల్లించాలంటూ మూడు నెలల క్రితం నెల్లూరుకు వచ్చిన డీఎంఈకి వినతిపత్రం ఇస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ఎన్నేళ్లు అడగాలి?



సెక్యూరిటీ సిబ్బంది వేతన బకాయిల కోసం నాలుగేళ్లుగా పోరాడుతున్నాం. వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు హామీ ఇచ్చినా నెరవేర లేదు. ఈ ప్రభుత్వం అయినా చొరవ తీసుకుని వెంటనే జీతం బకాయిలు చెల్లించాలి.

- సతీష్‌కుమార్, యునైటెడ్ మెడికల్ హెల్త్ యూనియన్ గౌరవాధ్యక్షుడు

కష్టపడి పని చేశాం... బకాయిలివ్వండి



2019లో అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో తమకు ఏజెన్సీ లేక పోయినా ప్రభుత్వ హామీతో పని చేశాము. అప్పటి జీతాలు ఇస్తామని చెబుతున్నారే గానీ ఇప్పటి వరకు చెల్లించలేదు. ఆ డబ్బులు వస్తే మా కుటుంబ అవసరాలకు ఉపయోగపడతాయి. మంత్రులను, అధికారులను ఎన్నో సార్లు కలిశాము. మా సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. కష్టపడి పనిచేసినందుకు వెంటనే జీతాలివ్వాలి.

- జడా శ్రావణ్, జీజీహెచ్ సెక్యూరిటీస్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఎన్‌డీసీఎంఎస్‌కు ఫార్మాసిస్టు నియామకం

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ జన ఔషధి కేంద్రానికి ఫార్మాసిస్టుగా డీ జనార్దన్‌రావును నియమిస్తూ జాయింట్ కలెక్టర్ కార్తీక్ శుక్రవారం ఉత్తర్వులు అందచేశారు. కార్యక్రమంలో ఎన్‌డీసీ ఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆ కళేబరాలు ఆవులవే..

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గం అడువుల్లోని హనుమాన్‌నాలా సమీపంలో ఉన్న నల్లబండ వద్ద ఉన్న మూగజీవాల కళేబరాల అవశేషాలు ఆవులవే అని శుక్రవారం అటవీ రేంజ్ అధికారి బీఎస్ కుమార రాజా శుక్రవారం తెలిపారు. బుధవారం ఈ ప్రాంతంలో మూగజీవాల కళేబరాల అవశేషాలు స్థానికులు గుర్తించి ఇవి వన్యప్రాణుల కళేబరాల అవశేషాలంటూ ప్రచారం చేపట్టారు. దీంతో అటవీశాఖాధికారులు కుర్రపల్లి పశు వైద్యాధికారి వినయ్‌ను సంఘటనా స్థలానికి తీసుకెళ్లారు. ఆయన మూగజీవాల శరీర భాగాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఆ పరీక్షల్లో కళేబరాల అశేషాలు ఆవులవే అని నిర్ధారిస్తూ నివేదిక అందజేసినట్లు రేంజ్ అధికారి తెలిపారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్, సీఐ గిరిబాబు, వారి వెనుక గంజాయి విక్రేతలు

గంజాయి విక్రేతల అరెస్టు

- 2కిలోల 530 గ్రాముల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు, 5 సెల్‌ఫోన్ల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీధర్



స్వాధీనం చేసుకున్న గంజాయి, సెల్‌ఫోన్లు

కావలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దపవని రోడ్డులోని రెండు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న 7గురిని శుక్రవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 2కిలోల 530 గ్రాముల గంజాయిని, రెండు మోటారు సైకిళ్లు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో రెండో పట్టణ సీఐ గిరిబాబుతో కలిసి జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రెండో పట్టణ సీఐ గిరిబాబుకు రాబట్టిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాలతో సీఐ గిరిబాబు, ఎస్ఐ షేక్ గౌస్‌బాష వారి సిబ్బంది స్థానిక పెద్దపవని రోడ్డులోని పీజీ కళాశాలకు ఎదురుగా విక్రయాలు జరుపుతున్న నలుగురిని అరెస్ట్ చేశారు. ఇందులో పెద్దపవని రోడ్డు ప్రాంతానికి చెందిన షేక్ మస్తానమ్మ, షేక్ గౌస్ బాష, షేక్ మీరాబీ, లింగసముద్రం మండలం అనుబోయినపల్లె దగ్గు చిన్నబ్బయ్యలను గుర్తించామన్నారు. వారి వద్ద నుంచి కిలో 180 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు పెద్దపవని రోడ్డులోని వైకుంఠపురం రైల్వే తూముల వద్ద గంజాయి విక్రయిస్తున్న ప్రకాశం జిల్లా అత్తయింటివారిపాలెం కారంశెట్టి సుధాకర్, పొన్నలూరు మండలం మాలెపాడు షేక్ గౌస్‌బాష, షేక్ రసూల్‌బీను అరెస్ట్ చేసి వారివద్ద మరో కిలో 350గ్రాముల గంజాయిని స్వాధీం చేసుకున్నారు. వీరిని విచారించగా పశ్చిమగోదావరి జిల్లా కొటానందూరు మండలం దారకొండ నుంచి ఒకరి వద్ద కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారందరని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు.

వాహనాల తనిఖీలో 10 కేజీల గంజాయి పట్టివేత

- పోలీసుల అదుపులో కర్ణాటక వ్యక్తి

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు జాతీయరహదారి టోల్ ప్లాజా సమీపంలో శుక్రవారం జరిపిన వాహనాల తనిఖీల్లో రూరల్ పోలీసులు సుమారు 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ముందస్తు సమాచారం మేరకు సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐలు తిరుమల రెడ్డి, బాజిబాబు సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో వైజాగ్ నుంచి నెల్లూరు వెళ్తున్న లారీలో నుండి కర్ణాటకు చెందిన వేలు అనే వ్యక్తి టోల్ ప్లాజా వద్ద దిగి తిరుపతి వైపు వెళ్లే లారీ కోసం ఎదురు చూస్తూ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని బ్యాగు తనిఖీ చేయగా గంజాయి పొట్లాలు దొరికినట్లు సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	186
స్కిన్‌లెస్	206
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7248
వెండి కిలో ధర	రూ. 87,500
వెండి ఒక గ్రాము	రూ.90.50

మహిళపై హత్యాయత్నం

వెంకటాచలం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపాళెంలో శుక్రవారం ఓ మహిళపై ఓ వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన ఎం.సుధాకర్ పాతకక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన పీ రమాదేవిపై దాడి చేసి తీవ్రంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు వెంకటా చలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోలీసులు నిందితుడు సుధాకర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.

వివాదాస్పద భూములను పరిశీలించిన జేసీ



వివాదాస్పద భూముల రికార్డులు పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

సంగం, డిసెంబరు 20: మండలంలోని జండాదిబ్బలో ఉన్న వివాదాస్పద భూములను జేసీ కార్తీక్ శుక్రవారం పరిశీలించారు. జొన్నవాడకు చెందిన ఆకుల మల్లికార్జున్‌కు జండాదిబ్బలో పట్టాపొలం ఉంది. అయితే ఈ పొలం హద్దుల్లో తేడా ఉంది. ఈ పొలంపై రైతు మల్లికార్జున పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పరిష్కారం కాకపోవడంతో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో జేసీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడే రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సోమ్లానాయక్, సర్వేయర్ శివరంజని, ఆర్ఐ, వీఆర్వో ఫిర్యాదుదారుడు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ శోభారాణి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు నూటికి నూరు శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా వారిలో ప్రేరణ కలిగించాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కే శోభారాణి వసతి గృహ సంక్షేమ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె చాంబర్‌లో హెచ్‌డబ్ల్యూవోల సమావేశం జరిగింది. విద్యార్థులను చదువుతోపాటు ఆటపాటల్లోనూ ప్రోత్సహించాలని సూచించారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హాజరత్తయ్య, తిరుపయ్య, రమణయ్య, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో రూ. 59లక్షల స్వాహా

- సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతం
- రికవరీకి ఆదేశించిన డ్వామా పీడీ గంగా భవానీ



పనుల్లో అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డ్వామా పీడీ గంగా భవానీ

సైదాపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదలకు పని కల్పించడంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఉద్దేశించి నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనుల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి రూ.59 లక్షల స్వాహా చేశారు. ఈ విషయం శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతం అయ్యింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన డ్వామా పీడీ గంగాభవానీ ఆ నిధుల రికవరీకి ఆదేశించారు. వివరాల మేరకు.. మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.8.88 కోట్లతో వివిధ పనులు చేపట్టారు. ఈ పనులపై గత 14 రోజులుగా 16వ సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో విచారణ చేపట్టడంతో పాటు క్షేత్రస్థాయిలో చేసిన పనులపై తనిఖీ నిర్వహించారు. నిబంధనలు, కొలతల ప్రకారం పనులు జరిగాయా లేదా, కూలీల హాజరు, నగదు చెల్లింపులు తదితర విషయాలను సమగ్రంగా పరిశీలించారు. దీనిపై నివేదిక రూపొందించారు. ఈ పనుల ఆడిట్ నివేదికపై సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికలో గ్రామాల వారీగా విచారణ చేపట్టారు. మండలంలో మస్టర్లు, కొలతల్లో తేడాలు చూపించి రూ.59,08,368లు స్వాహా చేసినట్లు గుర్తించారు. అందులో అత్యధికంగా రాగనరామాపురం రూ.18,25,931ల అవకతవకలతో ప్రథమ స్థానంలో నిలవగా రూ.14,71,810ల అవకతవకలతో చీకవోలు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ అవకతవకలపై డ్వామా పీడీ గంగాభవానీ మండిపడ్డారు. కాగా ఉదయం 10.10 గంటలకు ప్రారంభమైన ప్రజా వేదిక రాత్రి వరకు 9 గంటల వరకు కొనసాగింది. గతంలో రూ.లక్ష లోపు రికవరీ ఉండగా ఈ దఫా భారీగా అవినీతి జరగడం చర్చనియాంశం అయ్యింది. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఏపీడీ నారాయణ, పీసీఏపీడీ సతీష్ బాబు, ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత ఆధార్ సేవలు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : కలెక్టరేట్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రంలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సేవలు అందించారు. సైదాపురం మండలంలోని చాగణం రాజుపాళెం గ్రామానికి చెందిన ఈగ శివ మణికి నూతనంగా ఆధార్ కార్డు తీసిచ్చారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్

నెల్లూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. నెల్లూరులోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా విద్యారంగ సమస్య లు మాత్రం పరిష్కరించ లేదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయడమేకాక, జీవో నెం 77ను రద్దు చేస్తామని యువగళం పాద యాత్రలో నారా లోకేష్ ప్రకటించార న్నారు. కానీ నేటికీ ఈ సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పవన్నారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురి డీబార్

వెంకటాచలం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విక్రమసింహపురి యూనివర్శిటీ పరిధి లోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమి స్టర్ పరీక్షలలో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు 8,627 మంది విద్యార్థులకు గాను 7,853 మంది హాజరు కాగా 774 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. వెంకటగిరిలోని ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో ముగ్గురు, విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం ఐదుగురు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడడంతో డీబార్ చేసినట్లు పేర్కొన్నారు.

ఫీజుల బకాయిలు విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ ధర్నా

నెల్లూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లూరులోని హరనాథపురం కూడలి లో శుక్రవారం ధర్నా చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.2,100కోట్లు ఫీజు రీయిం బర్స్‌మెంట్, రూ.1,480 కోట్లు వసతి దీవెన చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే విడుదల చేయాలని కోరారు. గతేడాది సంబంధించి ఫీజులు విడుదల కాకపోవడంతో కోర్సు పూర్తయినా సర్టిఫికెట్లు రాక, చివరి ఏడాది చదువుతున్న వారు పరీక్షలకు హాజరుకాలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు విద్యార్థుల కష్టాలను తీర్చాలని, లేని పక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివం వర్మ, హనీఫ్, అబ్దుల్, తౌసిఫ్, మౌలి, సోహెల్, దాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ శ్రేణులు

ఆస్పత్రా.. అసాంఘికాలకు నిలయమా!?

● అడవిని తలపిస్తున్న గండిపాలెం పశువైద్యశాల ● పశువైద్యానికి వచ్చేందుకు జంకుతున్న పాడిరైతులు



ఆస్పత్రి ఆవరణలో మందుబాబులు పడేసిన ఖాళీ సీసాలు, గ్లాసులు



కంపచెట్లతో మూసుకుపోయిన గండిపాలెం పశువైద్యశాలకు వెళ్లే రోడ్డు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గండిపాళెం పశు వైద్యశాలకు వెళ్లాంటే ప్రజలు, పాడి రైతులు హడలెత్తిపోతున్నారు. తొమ్మిది పంచాయతీలకు సంబంధించిన ఏకైక వైద్యశాల కావడంతో ప్రతినిత్యం తమ జీవాల వైద్యం కోసం ఎంతో మంది ఇక్కడికి తీస్తుంటారు. తీరా అక్కడికి వచ్చాక వైద్యశాల ప్రాంగణంలోని అల్లుకుని ఉన్న కంప, పిచ్చి చెట్లను చూసి నివ్వెరపోతున్నారు. విషపురుగుల తాకిడికి గురి కావాల్సి వస్తుందోమోనని వాపోతున్నారు. కనీసం లోపలికి వెళ్లే రోడ్డు సైతం కంచెట్లతో మూసుకుపోయినా వాటిని తొలగించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రహరీ గేటు వేసే అవకాశం కూడా లేకుండా పోయింది. వైద్యశాల కాస్త మందుబాబులకు అడ్డాగా మారందని స్థానికులు చెబుతున్నారు. ఎంచక్కా మద్యం సేవించి ఖాళీ సీసాలు, గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు అక్కడే పడేయడంతో ప్రాంగణమంతా అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతుంది. పట్టుమని పది నిమిషాలు ఉండలేమని అక్కడికి వచ్చిన పాడి రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకముందే పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తాగునీటి సరఫరా



తాగునీటిని సరఫరా చేస్తున్న ట్యాంకర్

అల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేట, ఇస్కపల్లి రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం కెఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాంకరుతో తాగునీటిని సరఫరా చేశారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేని ప్రాంతాల్లో కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపకారు. పలుమార్లు అధికారులను విన్నవించుకున్నా తాగునీటి సరఫరా సమస్యలను తీర్చలేదని ఫౌండేషన్ తీర్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డీలర్‌పై 6ఏ కేసు నమోదు

చేజర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తలూరు గ్రామంలోని రేషన్‌షాపు నెం.920030లో ఈ-పాస్ మిషన్‌లో ఉన్న సరుకులకు భారీగా వ్యత్యాసం ఉండడంతో సదరు డీలరుపై 6ఏ కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. చిత్తలూరులో రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడంలేదన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ వెంకటేశ్వర్లు, వీఆర్వో హరీష్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో బియ్యం 2,255 కేజీలు, చక్కెర 43 ప్యాకెట్‌లు, కందిపప్పు 19ప్యాకెట్‌లు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు దీంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక క్యాంప్

ఆత్మకూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాతీయ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పీ.ఐజాక్‌ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో మూడు చక్రాల బండ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌ఛైర్లు తదితర ఉపకరణముల కోసం అర్హులైన వారిని ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, యుడీఐడీ కార్డు, వయోవృద్ధులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని క్యాంపునకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

రైతులకు అండగా టీడీపీ ప్రభుత్వం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సును దృష్టిని ఉంచుకొని టీడీపీ ప్రభుత్వం నిరంతరం రైతులకు అండగా నిలుస్తుందని పార్టీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు అన్నారు. శుక్రవారం విరువూరు రైతుసేవా కేంద్రంలో రైతులకు పంపిణీ శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో రవికుమార్, నేతలు ముజ్జె లక్ష్మీనారాయణ, వీఏఏలు శారద, చంద్రశేఖర్, శ్రీకాంత్, ఆదిత్య, పవన్ పాల్గొన్నారు.

గాడ్గే బాబాకు రజక ఉద్యోగుల నివాళులు

కందుకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ మూలపురుషుడు గాడ్గే బాబా ఆదర్శనీయుడని రజక ఉద్యోగుల సంఘం నాయకులు కోటయ్య, బొప్పరాజు కాశీరత్నం తెలిపారు. వర్ధంతి సందర్భంగా శుక్రవారం కందుకూరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీసీ వసతిగృహం తనిఖీ

సంగం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి ప్రసన్న శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు, నిల్వ సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం, సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

న్యూస్ బాక్స్

నేడు ప్రాజెక్టు కమిటీ ఎన్నిక

ఉదయగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొన్నెబోయిన చెంచురామయ్య (గండిపాళెం) జలాయశయం కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించనున్నట్లు జలవనరులశాఖ డీఈ చంద్రమౌళి శుక్రవారం తెలిపారు. 17 డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకోనున్న ట్లు చెప్పారు.

ఎక్సైజ్ అధికారుల దాడి

కావలి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సర్వాయపాలెంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న బెల్టు దుకాణంపై శుక్రవారం ఎక్సైజ్ అధికారులతో కలిసి సీఐ శ్రీనివాసులు దాడులు నిర్వహించారు. తెలిపారు. ఈ దాడుల్లో మద్యం అమ్మకాలు చేపడుతున్న ఇస్సారపు శీనయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 12 సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ దేవిక, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన ఉపాధ్యాయులు

కావలి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజువారి చింతలపాలెం జెడ్పీ హైస్కూల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు జగన్నాథ్ చేతులమీదుగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వెంకట రమణ శుక్రవారం స్టడీ మెటీరియల్ మాదిరి ప్రశ్నాపత్రాల బుక్‌ను అందజేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, సురేష్, మహేష్, ఫయాజ్, హర్షవర్ధన్, అంజనేయకుమార్, ఆర్.వెంకటేశ్వర్లు, సురేంద్రారెడ్డి, వీణా మాధవి పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన ఉండాలి

ఏఎస్ పేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలికలు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగహన కలిగి ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లడుతూ సైబర్ నేరాలు, మహిళల చట్టలపై అవగహన ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, విద్యాలయ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ శ్రీపూజ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ హెచ్చరించారు. శుక్రవారం గణేశ్వరాపురంలో ఆక్రమణకు గురైన భూములను ఆమె పరిశీలించారు. సర్వే నంబరు 196 లోని పశువుల మేత పోరంబోకు భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు కొంతమంది గ్రామస్థులు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆక్రమణదారులకు నోటీసులు అందజేసి భూములను స్వాధీనం చేసుకోవాలని తహసీల్దారు హేమంత్‌కుమార్‌ను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు స్థానిక సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులోను పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో మైనింగ్ తవ్వకాలను అనుమతులు ఇవ్వొద్దని జంగంరెడ్డిపల్లివాసులు ఆమెకు విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచు దిలీప్‌కుమార్, డీటీ చెంచయ్య, వీఆర్వోలు భోగ్యం ప్రసాద్, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ మహాసభ కానుకలు అందజేత



కానుకలతో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

సీతారామపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా మహాసభలు నిర్వహించినట్లు ఆ శాఖ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భోగ్యం శ్రీనివాసులు, గొడ్లవేటి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. అందులో భాగంగా మహాసభకు హాజరైన ఉపాధ్యాయులకు క్యారేజీ బ్యాగ్‌లు, జిల్లా శాఖ కుటుంబ సంక్షేమ పథకం సభ్యులు పంపిన వాటర్ బాటిల్స్‌ను స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తిరుపతయ్య, రంతు జానీ, సురేష్, కుమారి, పేరాల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలతో భూ సమస్యలు పరిష్కారం



వలేటివారిపాలెం: పాల్గొన్న తహసీల్దార్ అబ్దుల్‌అమీద్



సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు సోమ్లానాయక్

ఉదయగి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లిలో తహసీల్దారు సుభ ద్ర పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వో అంజాద్, సిబ్బందిపాల్గొన్నారు.

● దుత్తలూరులో: భైరవరంలో తహసీల్దారు వై.నాగరాజు పాల్గొని అర్జీ లను తీసుకున్నారు. అనంతరం గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సర్వే రాళ్లపై బొమ్మలు, పేర్లు తొలగింపును పరిశీలించారు. త్వరితగతిన సర్వేరాళ్లపై ఉన్న వాటిని తొలగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● జలదంకి: జమ్మలపాలెంలోని రెవెన్యూ సదస్సులో తహసీల్దారు ప్రమీ లకు పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. 45రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. సదస్సులో సర్పంచ్ బుర్రి శ్రీవేణి, మాజీ స ర్పంచ్ నక్కా మాధవరావు, నీటిసంఘం అధ్యక్షుడు జాజుల కోటయ్య, ఆర్ఐ శ్రీజ, వీఆర్వో ఫణి, సర్వేయర్ శోభన్, రీసర్వే డిటి శ్యాంసన్ పాల్గొన్నారు.

● సంగం: మండలంలోని వంగల్లులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లానాయక్ అర్జీలు స్వీకరించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజనారాయణ, సర్వేయర్ శివరంజని, వీఆర్వో, స్థానిక టీడీపీ నాయకులు రఘురామయ్య, రైతులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: మండల తహసీల్దార్ అబ్దుల్‌అమీద్‌జమీన్‌ఉప్పలపాడులో సదస్సులో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కా ర్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్వో బాదుల్లా, విలేజ్ సర్వేయర్ నాగమణి రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతుల నిరసన



నిరసనలో పాల్గొన్న లక్కు కృష్ణప్రసాద్, రైతులు

ఆత్మకూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అనంతసాగరం, చేజర్ల, ఆత్మకూరు, ఏఎస్‌పేట మండలాలకు చెందిన సుమారు 750 మంది రైతులు వ్యవసాయ మోటర్లుకు డబ్బులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు రైతులకు ట్రాన్స్‌పార్మర్లు, విద్యుత్‌వైర్లు సరఫరా చేయకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్ట ప్రాంతాల రైతులకు సకాలంలో విద్యుత్ పరికరాలు అందజేసి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం



కావలి: మాట్లాడుతున్న డీపీటీవో మురళీ బాబు, పక్కన దివ్య కామాక్షి, కల్పన

కావలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆదాయం పెంపు కోసం చేపట్టిన కార్గో సేవల్లో భాగంగా ప్రతి ఆర్టీసీ ఉద్యోగి కనీసం నలుగురి నుంచి డోర్ డెలివరీ పార్శిల్ల బుక్ చేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) మురళీ బాబు కోరారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డోర్ డెలివరీ మాసోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏపీఎస్ ఆర్టీసీ అందిస్తున్న పార్శిల్ కొరియర్ రవాణా సేవల గురించి ఆర్టీసీ ఉద్యోగులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రస్తుతం క్రిస్టమస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలను దృష్టిలో పెట్టుకుని నెల రోజులలో డోర్ డెలివరీ పార్సిల్స్ పెంచి ఆర్టీసీకి ఆదాయం సమకూర్చాలన్నారు. దేశంలో మొదటిసారిగా ఏపీఎస్ ఆర్టీసీ సరుకు రవాణా చార్జీలను ప్రారంభించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజరు దివ్య కామాక్షి, డిపో అసిస్టెంట్ మేనేజరు కల్పన, అసిస్టెంట్ ఇంజనీర్ ఖాజామొహిద్దీన్, బస్టాండ్ ఇన్‌చార్జి రమేష్‌బాబు, రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ పెంచలయ్య, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్ పాల్గొన్నారు.



కందుకూరు: మాట్లాడుతున్న టీవీఎన్ లక్ష్మి కామాక్షి, కల్పన

60ఏళ్లు పైబడిన వారు డ్రైవర్లుగా నియమించొద్దు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూళ్లు, కాలే జీల నిర్వాహకులు తమ బ స్సులకు 60ఏళ్ల దాటిన వారి ని డ్రైవర్లుగా నియమించ కుండా స్వీయనియంత్రణ పాటించాలని కందుకూరు ప్రాంతీయ రవాణా అధికారి టీవీ. ఎన్. లక్ష్మి కోరారు. స్థానిక రవా ణాశాఖ ప్రాంతీయ కార్యాలయంలో స్కూల్స్, కాలేజీల బస్సు డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహనా సమావేశంలో మాట్లాడారు. రోడ్డు భద్రతా ప్రమాణాలు ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని, బస్సులు స్టార్ట్ చేసేటప్పుడు చుట్టుపక్కల చూసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓవర్‌స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం అన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ చెన్నూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిర్ణయాలతో ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం

● మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు

కావలి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): దేశంలో రాజకీయ అనిశ్చితి నెల కొనడంతో ప్రజా పోరాటాలే శరణ్యంగా కన్పిస్తుందని మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాల యంలో పార్టీ పట్టణ కార్యదర్శి పసుపులేటటి పెంచులయ్య అ ధ్యక్షతన జరిగిన డివిజన్‌స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కేంద్రప్రభుత్వ విధానా లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను 5ఏళ్ల ఎండగట్టిన టీడీపీ అధికారంలోకొచ్చిమి న్నకుండిపోవడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు నేటికి అమలు చేయ కుండా కూటమి ప్రభుత్వం బీజేపీకి దాసోహం అయ్యిందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జర గబేయే 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీని యర్ నాయకులు వెంకయ్య, తిరుపాల్, మధుసూదన్‌రావు, కృష్ణమోహన్, శ్రీనివాసులు, చెన్నయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జంటనాగుల శిలా ప్రతిష్ఠ

బిట్రగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వర ఆలయంలో శుక్రవారం జంటనాగుల శిలా ప్రతిష్ఠ చేపట్టారు. పూజా కార్యక్రమాలకు బెంగుళూరు దుబిశెట్టి శివకుమార్, భానుశాంతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వేదపండితులు వేదగిరి ఆంజనేయ వరప్రసాదాచార్యులు స్వామిఅమ్మవార్లకు అభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి జంట ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు బత్తుల రవిచంద్ర, దుబిశెట్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చివరిగా భక్తుల కు ఆలయప్రాంగణంలో గ్రామస్థులు, భక్తులకు అన్నదానం చేపట్టారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే తనయుడి పరామర్శ



అక్బర్‌ను పరామర్శిస్తున్న కాకర్ల సంహిత్

ఉదయగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనయుడు సంహిత్ శుక్రవారం మండలంలోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ముందుగా పట్టణంలోని సుద్ధబావి వీధిలోని షేక్ అక్బర్ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే స్థానిక కావలి మార్గంలోని ఎస్టీ కాలనీని సందర్శించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్లపడియ పంచాయతీ కోటాయలపల్లి జొన్నలగడ్డ నారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, సందానీ, నల్లిపోగు నరసింహులు, తుమ్మల కిరణ్, సీహెచ్ శివకృష్ణ, బాబు, అంకయ్య, మాల్యాద్రి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై ప్రజా సంఘాల నిరసన



అల్లూరు: నిరసన తెలుపుతున్న దళితులు



ఉదయగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఉదయగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బీఆర్ అంబేడ్కర్ పట్ల చేసిన వ్యాఖ్యలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. అమిత్‌షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కోడె రమణయ్య, ఫడ్స్ రమణయ్య, ఎస్.బాలయ్య, శ్రీరాములు, ఆర్.తిరుపతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కించపరిచేలా పెద్దల సభలో మాట్లాడటం యావత్తు జాతిని అవమానించినట్లే బీసీ కులాల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ మరియం శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో బీజేపీ రాజ్యాంగ సవరణతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు ఎత్తివేయాలని కుట్ర చేస్తుందన్నారు.).

● అల్లూరు: అంబేద్కర్‌ను పార్లమెంట్ సభలో అవమానపరచిన కేంద్రమంత్రి అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అల్లూరు దళితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక పాతబస్టాండు కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎల్లు సాల్మన్‌రాజు, పప్పు సుధాకర్, పంగులూరు చిన్నయ్య, ముసలి నరేంద్ర, పంగులూరు సుధాకర్, సతీష్, చెంతాటి సుధాకర్ పాల్గొన్నారు.

దొంగతనాలపై పోలీసుల మైక్ ప్రచారం



ప్రచారం చేయిస్తున్న ఎస్ఐ భోజ్యా

బిట్రగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చోరీలు జరుగకుండా ఉండేలా విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తలు పాటిస్తు పోలీసులకు సహకరించాలని ఎస్సై భోజ్యా స్థానికులను హెచ్చరించారు. చోరీలపై నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ భోజ్యా శుక్రవారం బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలో ఆటోలో మైక్‌లను ఏర్పాటు చేయించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండుగల సమయంలో ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం తెలియజే యాలన్నారు.

రాష్ట్ర ముస్లిం మైనార్టీ సలహాదారుడికి శుభాకాంక్షలు

సంగం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా పెందుర్తిలో జరిగిన నూర్‌బాషా సంఘం మహాసభ జన గర్జనకు హాజరైన రాష్ట్ర ముస్లిం మైనార్టీ సలహాదారుడు ఎంఏ షరీఫ్‌ను శుక్రవారం నూర్‌బాషా సంఘం మండల అధ్యక్షుడు షేక్ ఖాజారంతుల్లా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నూర్‌బాషా సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఎల్‌పురంలో దోమల నివారణ చర్యలు

బిట్రగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ చెంచులక్ష్మీపురంలో అధికారులు శుక్రవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. కోవూరుపల్లి వైద్యులు రాజశేఖర్ పంచాయతీ సిబ్బందితో గ్రామంలోని అంతర్గత కాలువల్లో నిల్వ ఉన్న నీటిపై దోమలు చేరకుండా స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోష్న, ఆశావర్కర్లు, స్థానికులు ఉన్నారు.

సర్వేపల్లిలో వైసీపీ గల్లంతు : ఎమ్మెల్యే సోమిరెడ్డి

వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరిక

ముత్తుకూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ పూర్తిగా గల్లంతేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ముత్తుకూరుకు చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు కాకుటూరు లక్ష్మణరెడ్డి, వార్డు సభ్యులు కావలి సుజాత, రొయ్యల శకుంతల, షేక్.ఆస్తాతో పాటు కాకుటూరు విజయమోహన్‌రెడ్డి, రవిదేవారెడ్డి, కిషోర్, పాముల నాగరాజులు టీడీపీలో చేరారు. వారికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో వైసీపీలో మిగిలి ఉన్న నాయకులు సైతం టీడీపీలో చేరుతున్నారన్నారు. ఇప్పటికైనా కాకాణి సోషల్ మీడియాలో లేనిపోని రచ్చలు చేయడం మాని, ఇంటికి పరిమితం కావడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఈదూరు రామ్మోహన్ రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, వల్లూరు మోహన్‌రావు, నడవడి ముత్యంగౌడ్, తెలుగు యువత, తదితరులు పాల్గొన్నారు.



సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేత కాకుటూరు దంపతులు, నాయకులు

పెంచలయ్య మృతి టీడీపీకి తీరనిలోటు

పొదలకూరు,(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ప్రభగిరిపట్నం గ్రామ మాజీ సర్పంచు కాకు పెంచలయ్య హఠాన్మరణం టీడీపీ తీరనిలోటని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభగిరిపట్నంలో పెంచలయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

జీజీహెచ్, నారాయణలో

ఉచితంగా జీరో డోస్ వ్యాక్సిన్

- టీకాలతో ఇబ్బందులొస్తే డీఐవోకు తెలియచేయండి
- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో పుట్టిన బిడ్డలకు 24 గంటల్లోపు వేయాల్సిన జీరో డోస్ వ్యాక్సిన్‌ను నగరంలోని జీజీహెచ్‌లో వేస్తారని, నారాయణ ఆసుపత్రిలోనూ ఈ టీకాలు ఉచితంగా వేసేలా మాట్లాడామని డీఎం హెచ్‌వో డాక్టర్ పెంచలయ్య తెలిపారు. శుక్రవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులతో సమీక్షించారు. వ్యాధినిరోధక టీకాల వల్ల సాధారణంగా ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని, ఎక్కడైనా ఈ టీకాల వల్ల చిన్నారులకు అనుకోని ఇబ్బందులు వస్తే వెంటనే జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరికి తెలియచేయాలని సూచించారు. తద్వారా అ చిన్నారికి మెరుగైన వైద్య చికిత్సలు అందే అవకాశం ఉంటుందన్నారు. పోలియో సర్వైలెన్స్ అధికారి డాక్టర్ మౌనిక మాట్లాడుతూ టీకాల అమలులో యాదృచ్ఛిక సంఘటనల వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అనీల, పెథాలజిస్ట్ డాక్టర్ కృష్ణమూర్తి, చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ చిరంజీవి, గైనకాలజీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ యశోధర, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డంతా గుంతలే!





నగరంలో మినీ బైపాస్ నుంచి అయ్యప్పగుడి వైపు వెళ్లే మార్గంలో ఫైవోవర్ బ్రిడ్జి పక్కన రోడ్డు గుంతలమయంగా ఉంది. ఇక్కడ బ్రిడ్జికి అటు, ఇటు రోడ్డు ఉంది. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ, బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ, వేదాయపాళెం రైల్వే స్టేషన్ వెనుకవైపు ప్రాంతాలకు చెందిన వందలాది మంది నిత్యం ఈ రోడ్ల మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వంతెనకు ఉత్తరం వైపు రోడ్డు పూర్తిగా ధ్వంసమై వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో వెళ్లేవాళ్లు, వచ్చేవాళ్లు అందరూ వంతెనకు రెండోవైపు రోడ్డునే ఉపయోగిస్తున్నారు. దీని వల్ల క్రమంగా ఆ రోడ్డు కూడా దెబ్బతింటోంది. పాలకులు, అధికారులు స్పందించి ఫైవోవర్ బ్రిడ్జికి ఉత్తరం వైపు రోడ్డును బాగుచేస్తే ఎంతో మందికి ప్రయోజనకరంగా ఉంటుంది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

కసుమూరు దర్గాలో భక్తుల సందడి

వెంకటాచలం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు మన రాష్ట్ర నలమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించగా మరికొందరు అన్నదాన కార్యక్రమాలు చేపట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా మస్తాన్ స్వామి దర్గాకు పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

గంగవరంలో పశువైద్య శిబిరం

కోవూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరంలో శుక్రవారం పశుసంవర్ధకశాఖ అధికారులు గర్భకోశ వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ కృష్ణమౌర్య మాట్లాడుతూ జిల్లాలో పశుగణాభివృద్ధి కోసం పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో 20 వేల పెయ్యదూడల ఉత్పత్తే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పశువైద్య శిబిరంలో డాక్టర్ ప్రీతి సాల్మన్, డాక్టర్ షబానా, సర్పంచు యేడెం లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

ఆధునిక వసతులతో కెనరా బ్యాంకు ప్రారంభం



కెనరా బ్యాంకును ప్రారంభిస్తున్న తిరుపతి హెచ్‌వోడీ పాండురంగ మిత్యంత

తోటపల్లిగూడూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరులోని కెనరా బ్యాంకులో ఇటీవల చేపట్టిన ఆధునీకరణ పనులు పూర్తి కావడంతో ఆధునిక వసతులతో శుక్రవారం తిరుపతి సర్కిల్ హెచ్‌వోడీ ఐ.పాండురంగ మితంత్య, నెల్లూరు రీజనల్ అసిస్టెంట్ మేనేజర్ ఆదారి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ ఈ బ్యాంక్ టర్నోవర్ రూ.కోటి 9 లక్షలు ఉన్నట్లు తెలిపారు. రూ.126 కోట్లు వ్యవసాయం, ఇతర రుణాలు అందజేసినట్లు తెలిపారు. ఖాతాదారులకు క్రెడిట్ కార్డు సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సహాయ మేనేజర్ భరత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు బీఈడీ విద్యార్థులు



ఆరిషాబేగం



రెహమున్ని

నెల్లూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయ బాస్కెట్ బాల్, ఖోఖో పోటీలకు నగరంలోని ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాలలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వేణుగోపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థినులు ఆరిషా బేగం కేరళలోని కొట్టాయంలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీలకు, ఆశా రెహమున్ని కాలికట్ యూనివర్సిటీలో జరిగే ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. పురుషుల విభాగంలో పీ గణేష్ తమిళనాడులోని సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ముగ్గురు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని, ఆ క్రీడాకారులు జాతీయ పోటీల్లో కూడా రాణించి కళాశాలకు, వీఎస్‌యూకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరక్టర్ ఎం రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక నిధులతో

వెనుబడిన ప్రాంతాల అభివృద్ధి

- టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లోని వెనుకబడిన ప్రాంతాలకు అధికంగా నిధులను సమీకరించి అభివృద్ధి పథం వైపు తీసుకెళ్లేందుకు ప్రణాళికబద్ధంగా పని చేస్తున్నామని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ద్వారా సుమారు రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగనున్న నేపథ్యంలో వాటిని ఏర్పాట్లను శుక్రవారం గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. రాష్ట్రంలోనే రూరల్ నియోజకవర్గాన్ని తొలి స్థానంలో నిలపాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అరవ శీను, తదితరులు పాల్గొన్నారు.

తండ్రీ తనయుడికి టీడీపీ శాశ్వత సభ్యత్వం

కోవూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీ శాసనసభ్యుడు పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆయన తనయుడు ఎన్విరాన్‌మెంటు మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దినేష్‌రెడ్డి శుక్రవారం తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో తండ్రీ కుమారులిద్దరూ చెరొక రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఒక్కటే రాష్ట్రాభివృద్ధిని సాధిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడుగు జాడల్లో నడుస్తామని తెలిపారు. సామాజిక న్యాయం పాటిస్తూ పార్టీ కార్యకర్తలు, నాయకుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న నారా లోకేష్ తమకు ఆదర్శమన్నారు.



మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకొంటున్న దినేష్‌రెడ్డి

బుచ్చిలో టీడీపీ సభ్యత్వ నమోదు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 43, 44, 45 పోలింగ్ బూత్‌ల పరిధిలో శుక్రవారం టీడీపీ నాయకులు చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో 150 మంది సభ్యత్వం తీసుకొన్నారు. ఈ ప్రాంతాల్లో ఇప్పటి వరకు 800 మంది సభ్యత్వం తీసుకొన్నట్లు నాయకులు వుసురుపాటి ప్రసాద్, కావలి వెంకటేశ్వర్లు, జడ సురేష్‌లు తెలిపారు.

రెవెన్యూ సదస్సుకు మూడు అర్జీలు

మనుబోలు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లపాడు రెవెన్యూ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రైతుల నుంచి మూడంటే మూడే అర్జీలు అధికారులకు అందాయి. దీనితో రెవెన్యూ అధికారులు ఆశ్చర్యపోయారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య, సర్వేయర్ శ్రీనువాసులు, ఆర్ఐ నారాయణ, వీఆర్‌వో నాగేంద్ర, ఈవో ఉమ తదితరులు పాల్గొన్నారు.



పర్లపాడులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు సుబ్బయ్య

పునాది బలంగా ఉంటేనే అద్భుత ఫలితాలు

వెంకటాచలం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : భాష, గణితం పరంగా పునాది బలంగా ఉంటే పిల్లలు అద్భుతమైన ఫలితాలను సాధించగలరని ఎస్సీఈఆర్టీ (రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి) అధ్యాపకురాలు మాధవి తెలిపారు. మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న టూరిజం కళాశాలలో ఆరు రోజులుగా ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే విద్యకు సంబంధించి పిల్లల్లో నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



నమూనాలను పరిశీలిస్తున్న ఎస్సీఈఆర్టీ అధ్యాపకురాలు మాధవి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు

మంత్రి నారాయణ కార్యాలయంలో ప్రీ క్రిస్మస్ సంబరాలు

కేక్ కట్ చేసిన మంత్రి సతీమణి రమాదేవి

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో గోమతి నగర్‌లోని మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి టీడీపీ నాయకురాళ్లు, క్రైస్తవ మహిళలు, పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. రమాదేవి మాట్లాడుతూ సమాజంలో అసమానతలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి బైబిల్ మార్గం చూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, జనసేన మహిళలు పాల్గొన్నారు.



ప్రీ క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న రమాదేవి, అనూరాధ, విజేత తదితరులు

వైసీపీ పాలనలోనే బియ్యం మాఫియా విజృంభణ

- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో బియ్యం మాఫియా విజృంభించిందని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో 1.30 కోట్ల టన్నుల రేషన్ బియ్యం దేశం దాటి పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు చెందాల్సిన వేల కోట్ల రూపాయలు మాఫియా జేబుల్లోకి వెళ్లిందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బియ్యం పథకంపై అధ్యయనం చేయాలని కోరారు. రేషన్ కార్డుదారులకు వెసులుబాటు కల్పించి బియ్యం కావాల్సిన వారికి బియ్యం ఇచ్చి, వద్దన్న వారికి కిలోకు రూ.43 నగదు బదిలీ చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు రేషన్‌కార్డుతో సంబంధం లేదని ప్రభుత్వం ప్రకటిస్తే ఎంతో మంది కార్డులు స్వచ్ఛందంగా వదులుకుంటారన్నారు. రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి

ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ

నెల్లూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ పరిధిలోని కల్లూరపల్లి ఇందిరమ్మ కాలనీ వద్ద రోడ్డుపైనున్న ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ జరిగినట్లు రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. దుకాణంలోని సుమారు రూ.లక్ష విలువ చేసే సామగ్రి అపహరణకు గురైనట్లు బాధితుడు మహేంద్ర ఫిర్యాదు చేశారని, దర్యాప్తు చేపట్టామని సీఐ జీ వేణు తెలిపారు.

మెరుగైన శాంతిభద్రతలు కల్పించాలి

- నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలు కల్పించాలని నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని చిన్నబజారు పోలీసుస్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి సూచనలు, సలహాలిచ్చారు. నేరనియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై స్థానిక ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పగలు, రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు.

పెన్‌కాక్ సిలోట్‌లో యశస్వినికి స్వర్ణం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖ పట్టణంలో ఈనెల 15న జరిగిన రాష్ట్రస్థాయి పెన్‌కాక్ సిలోట్ ఆటల పోటీలో నెల్లూరుకు చెందిన పీ యశస్విని ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం సొంతం చేసుకుంది. నగరంలోని వేదవ్యాస హైస్కూల్‌లో 10వతరగతి చదువుతున్న ఆ బాలికను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. త్వరలో సౌత్ ఇండియా పోటీలకు ఆమె ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని స్కూల్ కరస్పాండెంట్ వేదగిరి తెలిపారు.



బంగారు పతకంతో యశస్విని

నేడు రామచంద్ర మిషన్‌లో ధ్యాన దినోత్సవం

నెల్లూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీ రామచంద్ర మిషన్ ధ్యాన మందిరంలో శుక్రవారం ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించనున్నట్లు సంస్థ జోనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం వెంకట కృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మిషన్ ఆధ్వర్యంలో నారాయణ ఇంజనీరింగ్, గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలల్లో కూడా ధ్యాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని కోరారు.

కళా శుభాకాంక్షలు

ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా సూక్ష్మ చిత్రాల శిల్పి పద్మారత్నం రావి ఆకుపై, అట్టముక్కల కత్తిరింపులతో ధ్యాన ముద్ర చిత్రం, శిల్పం రూపొందించారు. ఆయన ముత్తుకూరు మండలంలోని సుబ్బారెడ్డిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పని చేస్తున్నారు.




పద్మారత్నం రూపొందించిన కళాఖండాలు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

శనివారం 21 డిసెంబరు 2024



శారీలేరు నీకెవ్వరూ..

6వ పేజీలో

భారతీయ సంస్కృతికీ, కళాత్మకతకూ చిహ్నం చీర. స్త్రీ నిండుదనానికి అద్దంపట్టే వస్త్రధారణ ఇది. చీరదేముంది.. ఒంటికి చుట్టేసుకోవడమే కదా అనుకుంటారు గానీ ప్రాంతానికో తీరుగా ఉండే చీరకట్టు ఆ ప్రాంతపు అస్తిత్వాన్ని పట్టి చూపుతుంది.. మిడ్డీలూ, అరచెడ్డీలూ, చింపుడు ప్యాంట్లూ, నిలువు గౌన్లూ.. ఇలా పడమటి గాలి ఎన్ని ఫ్యాషన్లు మోసుకొచ్చినా.. మన చీర మాత్రం చెక్కుచెదరని అందానికి ప్రతీకగా నిలిచే ఉంది. అందుకే చీరకీ ఏడాదికో పండుగదినాన్ని నిర్ణయించారు. అది ఈరోజే! దేశ ఫ్యాషన్ పటంపై ఎగురుతున్న మనజిల్లా చీరల విశేషాలు..



తిరుమలలో అఖిల్

తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం దర్శించుకుని వస్తున్న సినీహీరో అక్కినేని అఖిల్

- తిరుమల, ఆంధ్రజ్యోతి

...అయినా ఇసుక ఆగలేదు

వైసీపీ ప్రభుత్వం పోయింది. 'కూటమి' అధికారంలోకి వచ్చింది. అయినా.. ఇసుక అక్రమ రవాణా ఆగలేదు. గత ప్రభుత్వంలో స్థానికులను బెదిరించి.. దౌర్జన్యంగా ఇసుక తరలించిన వారే ఇప్పుడూ కీలక పాత్ర పోషిస్తున్నారు. అధికార యంత్రాంగం చూసీచూడనట్టు ఉంటోంది.

- చిట్టమూరు, ఆంధ్రజ్యోతి



ఇసుక లోడ్‌తో తడకు బయలుదేరుతున్న ట్రాక్టర్లు

● మెట్టు స్వర్ణముఖి నది నుంచి భారీగా తరలింపు
● వైసీపీ కనుసన్నలలో అక్రమ రవాణా ● పట్టించుకోని అధికార యంత్రాంగం

చిట్టమూరు మండలం మెట్టు స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కొందరు అధికారులకు, ఇసుకాసురులకు ఆదాయ వనరుగా మారింది. నిత్యం తడ, ఆరంబాకం నుంచి ట్రాక్టర్లు వరుసపెట్టి ఇసుక దోచుకపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఓ వైసీపీ బడా నాయకుడి కనుసన్నల్లో గ్రామాన్ని గుప్పెట్లో పెట్టుకొని ఎస్సీ ఎస్టీ, బీసీ వర్గాలతో ఇసుక లోడ్ చేసేందుకు వంతుల ఆశ కల్పించి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు మెట్టు స్వర్ణముఖి నదిలోకి వెళ్లే దారులకు అధికారులు గోతులు తీయించారు. వాటిని పూడ్చేసి మళ్లీ ఇసుక రవాణాకు శ్రీకారం చుట్టారు. ప్రతి రోజు తడ, ఆరంబాకం ప్రాంతాల నుంచి మెట్టు స్వర్ణముఖి నదికి ట్రాక్టర్లు వస్తున్నాయి. మెట్టు ప్రాంతాలకు చెందిన ట్రాక్టర్లు నదిలోకి వెళ్లి ఇసుక లోడ్ చేసుకొని ఊరి బయట వచ్చి ట్రక్కులు మార్చుకొని ఇసుక రవాణా సాగిస్తున్నారు. మెట్టు గ్రామంలోనే విశాలమైన ప్రాంతలో ఇసుక నిల్వ చేసి తడ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు ఇసుకకు పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి ప్రభుత్వం ఉచిత విధానాన్ని తీసుకొచ్చింది. బయట ప్రాంతాలకు ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. అయినా అధికారులు క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదు. అందుకే అక్రమ రవాణా ఆగడంలేదు.

వ్యతిరేకత వచ్చే అవకాశం

'అయ్యా మా నదిలో ఇసుకెత్తద్దు. నీటి వనరులు పడిపోతాయ్' అంటూ స్థానికులు కోరినా వైసీపీ ప్రభుత్వంలోని ఇసుకాసురులు కనికరించలేదు. అడ్డుకుంటే పోలీసు కేసులు పెట్టించారు. దౌర్జన్యంగా ఇసుక తరలించారు. పార్టీలకతీతంగా ఇక్కడి రైతులు, ప్రజలు కోర్టులను ఆశ్రయించారు. అయినా, అధికారుల సహకారంతో తప్పుడు సమాచారం ఇచ్చి ఇసుకాసురులు లైన్‌క్లియర్ చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఎన్నికల నాటికి అది బయటపడింది. ఇప్పుడూ, నాటి ఇసుకాసురులు అక్రమ రవాణా కొనసాగిస్తుంటే.. ఆ వ్యతిరేకత సెగ కూటమి ప్రభుత్వానికీ తగలుతుంది.



మెట్టు స్వర్ణముఖి నదిలో ట్రాక్టర్లకు ఇసుక లోడ్ చేయిస్తున్న వైసీపీ అనుచరుడు

ఇసుక డంప్ స్వాధీనం

రేణిగుంట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం రజక కాలనీ సమీపంలో ఇసుక డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ డంప్ చేసిన ఇసుక రాత్రివేళ టిప్పర్ల ద్వారా బయట ప్రాంతాలకు తరలించేవారు. దీనిపై రెవెన్యూ అధికారుల సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. 20 ట్రక్కుల ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గాజులమండ్యం పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

'రియల్ వెంచర్'లోనూ ఇసుక గుట్టలు

తిరుపతిరూరల్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలో గ్రామాలకు సమీపంలోని స్వర్ణముఖినది, వాగుల్లోంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకొచ్చి ముళ్ల పొదలు, ఖాళీ రియల్‌వెంచర్లలో డంపు చేస్తున్నారు. అక్కడ్నుంచి అమ్మకాలు.. బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇదేతరహాలో పలువురు అక్రమంగా ఇసుకని అక్రమంగా తరలించారు. ఇప్పుడూ ఈ ఇసుక రవాణా ఆగలేదు. గొల్లపల్లె, పైడిపల్లెగ్రామాల్లో పలుచోట్ల ముళ్లపొదలు, రియల్‌ఎస్టేట్ వెంచర్లలో ఇసుక డంపులున్నాయని గ్రామస్తులు అంటున్నారు. పైడిపల్లెలోని రియల్ వెంచర్‌లో మామిడిచెట్టుల మాటున పలుచోట్ల ఇసుక నిల్వలు ఉంచారు. గాంధీపురం పంచాయతీలోని ప్రభుత్వస్థలంలో ఇసుక నిల్వకేంద్రాన్ని ఏర్పాటు చేసి విక్రయాలు చేపడుతున్నా యంత్రాంగం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



పైడిరెడ్డిపల్లె వద్ద..

ఈరోజు 16 గంటల రాత్రి

తిరుపతిరూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఈ రోజు (డిసెంబరు 21వ తేది) 16 గంటలపాటు రాత్రి ఉంటుంది. సూర్యుడికి అత్యంతదూరంలో భూమి ఉండడం, దక్షిణధ్రువం వద్ద 23.4 డిగ్రీలు వంగి ఉండడం కారణంగా దీన్ని శీతాకాల ఆయనాంతమని (వింటర్ సోలిస్టిక్) అంటారు. మన దేశంతో పాటు ఐస్‌లాండ్, అలాస్కా, నార్వేలలో ఈరోజు ఒక అద్భుతం చూడనున్నామని తిరుపతి జిల్లా సైన్సు అధికారి భానుప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దీనివల్ల శనివారం ఏకంగా రాత్రిసమయం (మబ్బులతో కూడిన చీకటి) 16గంటలు, సూర్యకాంతి కేవలం 8గంటలే ఉంటుందన్నారు. ప్రత్యేకించి చంద్రుడి కాంతి భూమిపై 16గంటలు ఉండడం వల్ల దీన్ని సుదీర్ఘరాత్రి అని అంటామన్నారు. 'సూర్యుడి కిరణాలు భూమిని చేరడానికి ఎక్కువ సమయం పట్టడం దీనికి మరోకారణం. ఏటా రెండుసార్లు వేసవి, శీతాకాల ఆయనాంతాలు వస్తాయి. ఏటా ఇలా 16గంటల సుదీర్ఘరాత్రి ఉండదు. ఈ శీతాకాల ఆయనాంతంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరుపుకొంటారు. ఉత్తరభారతదేశంలో శ్రీకృష్ణుడుకి నైవేద్యం సమర్పించి గీతాపారాయణం చేస్తారు. రాజస్థాన్‌లో పండుగని నిర్వహిస్తారు. సూర్యుడు ఉత్తరాన ప్రక్రియ శీతాకాలం నుంచి మొదలవుతుంది' అని వివరించారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు

చంద్రగిరి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శానంబట్ల సమీపంలో శివగిరి వద్ద స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తరలింపుపై శుక్రవారం మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. హిటాచీ, టిప్పర్, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మైనింగ్ ఏజీ వీరేష్ తెలిపారు. ఈ వాహనాలను పోలీసులకు అప్పగించారు. పోలీసులు స్వర్ణముఖి నదిలో దాడులు నిర్వహించి మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు.



మైనింగ్ అధికారులు సీజ్ చేసిన టిప్పర్, ట్రాక్టర్లు



మైనింగ్ అధికారులు సీజ్ చేసిన హిటాచీ

నా పేరు చెబితే అరెస్టు చేయండి

రేణిగుంట, ఆంధ్రజ్యోతి: ఇసుక అక్రమ రవాణాలో ఎవరైనా తన పేరు చెబితే వెంటనే అరెస్టు చేయాలని అధికారులను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశించారు. రేణిగుంట మండలం అన్నాసామిపల్లెలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ఇసుక అక్రమ రవాణాపై తీవ్రంగా స్పందించారు. తన పేరు చెప్పినా వదిలిపెట్టొద్దని, చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్లపై గుంతలకు మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమలలో రోడ్లపై ఏర్పడిన గుంతలకు టీటీడీ తాత్కాలిక మరమ్మతులు చేపట్టింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్లతో పాటు తిరుమలలోని రోడ్లపైనా గుంతలు ఏర్పడ్డాయి. వీటివల్ల శ్రీవారి దర్శనార్థం వచ్చే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారంటూ 'ఈ గుంతలేంటి గోవిందా..!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఈక్రమంలో టీటీడీ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. రానున్న నెలరోజుల్లో పూర్తిస్థాయిలో రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.



మరమ్మతుల అనంతరం హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు

రెవెన్యూ సదస్సులకు 728 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న సదస్సుల్లో రెవెన్యూ, భూసమస్యలను సులభతరంగా పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా 47 గ్రామసభల ద్వారా 728 అర్జీలు అందాయి. అందులో అసైన్‌మెంట్ ఆఫ్ హౌస్‌సైట్స్‌పై 155, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్‌పై 33, రీసర్వే 75, ఫాం 22ఏ 3, క్యాస్ట్ వెరిఫికేషన్ 4, ల్యాండ్ గ్రాబింగ్ 2, ఆర్‌వోఆర్ 389, ఇతర విషయాలకు సంబంధించి 52 వచ్చాయి. వాటిలో 29 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించారు. మిగిలినవి కాలపరమితిలోపు పరిష్కరిస్తారని కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. రేణిగుంట మండలం అన్నాసానిపల్లెలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలసి ఆయన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు.

ఎస్వీయూలో చిరుత కలకలం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో చిరుత కలకలం రేగింది. సైన్స్ కాలేజీ భవనానికి సమీపంలో విద్యార్థులకు చిరుత కనిపించడంతో పరుగులు తీశారు. అక్కడే పడిపోయిన ఒక విద్యార్థికి సపర్యలు చేసి, వెంట తీసుకెళ్లారు. రెండు వారాల క్రితం వేద విశ్వవిద్యాలయంలో చిరుత పాదముద్రలు కనిపించిన విషయం తెలిసిందే. చిరుత సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్న ఫారెస్టు అధికారులు యూనివర్సిటీ బొటానికల్ గార్డెన్‌ను తనిఖీ చేసి కొన్ని ఆనవాళ్లను పరిశీలించారు. ఈ ప్రాంతానికి సమీపంలోనే అమ్మాయిల హాస్టల్ కూడా ఉంది. రిజిస్ట్రార్ భూపతి నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫారెస్టు, పోలీసు సిబ్బంది యూనివర్సిటీకి చేరుకున్నారు. ఫారెస్టు అధికారులు శ్రీనివాసా ఆడిటోరియం వద్ద చిరుత పులి పాదముద్రలను సేకరించారు. కొన్ని చెట్లకు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాగా, పులి సంచారం నేపథ్యంలో రాత్రి 8 నుంచి ఉదయం 6.30 గంటల్లోగా ఎవరూ క్యాంపస్‌లో తిరగకూడదని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ఆదేశించారు. అన్ని కాలేజీలు, విభాగాలు, హాస్టళ్లకు శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు.

అభివృద్ధికి హామీ.. మహిళలకు ధైర్యం !

● రెండవ రోజూ భువనేశ్వరి విస్తృత పర్యటన

కుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి రెండవ రోజైన శుక్రవారం కుప్పం మండలం వానగుట్టపల్లె, గుండ్లమడుగు, అడవిబూదుగూరు, కుప్పం మున్సిపాలిటీ డీకేపల్లెల్లో విస్తృతంగా పర్యటించారు. కుప్పం అభివృద్ధికి హామీ ఇస్తూ, మహిళలకు ధైర్యం చెబుతూ ఆమె పర్యటన సాగింది. మహిళలు కూడా సొంత కుటుంబంలోని వ్యక్తిలాగా చాలా చనువుగా తమ సమస్యల గురించి ప్రస్తావించి పరిష్కారాలు కోరారు.గత ప్రభుత్వ హయాంలో సాగిన అరాచకాలు, అభివృద్ధి లేమిపై విమర్శనాస్త్రాలు సంధించిన భువనేశ్వరి చంద్రబాబు అంతకంతకంత అభివృద్ధి చేస్తారని ప్రజలకు నమ్మకం కలిగించగలిగారు. ఉదయం 11.30 గంటలకు వానగుట్టపల్లెలో మహిళలతో ముఖాముఖిలో ఆమె పాల్గొన్నారు. అక్కడినుంచి అడవిబూదుగూరు, కుప్పం మున్సిపాలిటీ డీకేపల్లెలో జరిగిన సభల్లోనూ మహిళలతో ముఖాముఖి న్విహించారు. సమస్యలు సావధానంగా విన్న ఆమె చంద్రబాబుకు చెప్పి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. మధ్యలో ప్రత్యంగరాదేవి దేవస్థానానికి వెళ్లి పూజలు చేసి, దేవికి వెండి కిరీటం బహూకరించారు. డీకేపల్లెలో సభ ముగిసేసరికి రాత్రి 7 గంటల సమయమైంది.



వానగుట్టపల్లెలో మహిళలతో ముఖాముఖి

కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు




తిరుపతి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం నుంచి భూములు, ఆస్తుల విలువలు పెరగనున్న నేపథ్యంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలు క్రయ, విక్రయదారులతో కిక్కిరిసిపోతున్నాయి. జనవరి 1నుంచి ఆస్తుల విలువను పెంచేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. దీంతో డిసెంబరు నెలలోపు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో శుక్రవారం తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనుగోలుదారులు క్యూకట్టారు. ఒకదశలో సబ్ రిజిస్ట్రార్లకు ఊపిరితీసుకునే సమయం కూడా లేకపోవడంతో కొనుగోలుదారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసున్నాయి. శ్రీ బాలాజీ జిల్లాలో భూ విలువల పెంపుపై తిరుపతి అర్బన్ మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ ఇప్పటికే సమావేశమైంది. మరో వారంలో జేసీ శుభం భన్సల్ అధ్యక్షతన కమిటీ సమావేశం కానుంది. రిజిస్ట్రేషన్ విభాగం ప్రతిపాదించిన ధరలను కమిటీ అంగీకారంతో పాటు ప్రజల నుంచి పెద్దఎత్తున అభ్యంతరాలు లేకపోతే కొత్త సంవత్సరంలో కొత్త ధరలు అందుబాటులోకి వస్తాయి.

అంబేడ్కర్ గురుకులాల్లో మరమ్మతులకు రూ.90 లక్షలు

తిరుపతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహణ గ్రాంటు కింద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో మరమ్మతులు చేపట్టేందుకు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ప్రభుత్వం రూ.90 లక్షలు మంజూరు చేసింది. పుత్తూరు గురుకులంలో తలుపులు, కిటికీల మరమ్మతులకు రూ.10 లక్షలు, చిల్లకూరు, వాకాడులో మరుగుదొడ్లు, మురుగునీటి కాలువల మరమ్మతులకు రూ.పదేసి లక్షల వంతున రూ.20 లక్షలు, నాయుడుపేటలో డార్మిటరీ రెండవ బ్లాక్, బ్లాక్ టూ తరగతి గది మరమ్మతులకు రూ.10 లక్షలు.. మొత్తం రూ. 40 లక్షలు మంజూరైంది. చిత్తూరు జిల్లాలో కుప్పం, చిత్తూరు, విజయపురం గురుకులాలకు రూ. 10 లక్షలు వంతున, రామకుప్పం గురుకులానికి రూ. 15 లక్షలు, పూతలపట్టు గురుకులానికి రూ.5 లక్షలు చొప్పున 50 లక్షలు మంజూరైంది.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1 లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.60 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,165

తలనీలాలు సమర్పించినవారు: 20,377



కోక..మన కోక!

చీర.. భారతీయ సంప్రదాయ చిహ్నమే కాదు. ట్రెండీ కూడా. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు ఆడవాళ్లు చీరల మీద మోజు పడుతున్నారు. మనదేశంలో ప్రాంతాన్ని బట్టీ చీర కట్టులో తేడాలుంటాయి. తాజాగా తొడుక్కునే చీరలు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. ఏ పెళ్లిలో అయినా చీరల తళుకులే ప్రత్యేక ఆకర్షణ. చీరంటే ఇప్పుడు.. ఒంటికి చుట్టుకునే వస్త్రం ఎంత మాత్రం కాదు. అందాన్ని పెంచే ఫ్యాషన్! అందుకే చీరలకూ ఒక ప్రత్యేక పండుగ దినాన్ని నిర్ణయించారు. దేశంలో ట్రెండీగా ఉన్న లేటెస్ట్ డిజైన్డ్ చీరలకు తిరుపతి జిల్లా కేంద్రంగా ఉంది. వెంకటగిరి కాటన్, నారాయణవనం పట్టు, కాళహస్తి కలంకారీ, మన్నారుపోలూరు సరిగ చీరలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబై నగరాల్లో రెపరెపలాడుతున్నాయి. ఒకప్పుడు సంప్రదాయ చీరలకే పరిమితమైన ఈ ప్రాంతాలు మారుతున్న అభిరుచులకు అనుగుణంగా డిజైన్లు మార్చుకున్నాయి. తిరుపతి నగరంలో అయితే మగ్గం వర్క్ చీరలు హల్‌చల్ చేస్తున్నాయి.

రాణులు మెచ్చిన వెంకటగిరి చీర

ఒకప్పుడు రాణులకే పరిమితమైన వెంకటగిరి చీర ఇప్పుడు పేదలకూ అందుబాటులోకి వచ్చింది. నూరవ నెంబరు స్వచ్ఛమైన కాటన్ నూలుతో నేసే ఈ చీరకే దేశ విదేశాల్లో పేరుంది. క్రీ.శ. 1700 నుంచీ వెంకటగిరి చీర ప్రస్తావన పలు చోట్ల కనిపిస్తుంది. వెంకటగిరిని ఏలిన వెలుగోటి వంశస్థులు ఇక్కడి చేనేతను ప్రోత్సహించారు. పిఠాపురం, బొబ్బిలి ఆస్థానాలకు కూడా వెంకటగిరి చేనేత చీరలు వెళ్లేవి. వెంకటగిరి చీరకు 1999లో జీఐ గుర్తింపు కూడా లభించింది. నీతూ అంబానీ, ప్రసిద్ధ సినీతారలు మెచ్చే చీరలుగా వీటికి గుర్తింపు లభించింది. మేలైన నూలుతో నేసే చీరలు కావడం వల్ల వయసు మీరిన వారికి కూడా కట్టుకుంటే తేలికగా ఉండడం వెంకటగిరి చీరల ప్రత్యేకత. నిరంతరం కొత్త డిజైన్లు ఇక్కడ తయారవుతుంటాయి. ఆధునిక సాంకేతికత ఇందుకు ఉపయోగపడుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో వెంకటగిరి చీరలకు మంచి గిరాకీ ఉంది. ఏటా పదివేలకు పైగా చీర లు వెంకటగిరి మగ్గాల నుంచి తయారవుతున్నాయి. విభిన్నమైన డిజైన్‌లతో చీరలు నేసిన 11 మంది వెంకటగిరి నేత కళాకారులకు రాష్ట్రపతి అవార్డులు లభించడం విశేషం.

-వెంకటగిరిటౌన్, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- జాందాని వర్క్ చీరలు. చీరంతా డిజైన్ ఉండే వీటిని నేయడానికి వారంనుంచి నెల రోజులు కూడా పడుతుంది. వీటి ధరలు రూ. రెండు వేల నుంచి రెండు లక్షల దాకా ఉంటాయి.
- పూర్తి కాటన్ చీరలు రూ. 500 నుంచీ కూడా ఇక్కడ లభిస్తాయి.







నారాయణవనం పట్టు స్టయిలే వేరు

చీరల్లోనూ పట్టుచీరల మీద ఉండే మోజు వేరే! అందుకే నారాయణవనం పట్టుచీరలకు అంత డిమాండ్. సింగిల్ త్రెడ్, డబుల్ త్రెడ్, వెండి జరీ, బంగారు జరీ చీరలను ఇక్కడ నేస్తారు.ఒకప్పుడు పూర్తిగా చేనేత చీరలే ఉండేవి. కాలక్రమంలో మరమగ్గాల మీద నేయడం మొదలు పెట్టారు. లతలూ పూలే కాకుండా దేవతా ప్రతిమల చిత్రాలతో కూడిన చీరలు నేయడం నారాయణవనం ప్రత్యేకత. ఈ చీరలు తక్కువ బరువు ఉండడంతో ఎక్కువ మంది ఇష్టపడుతారు. ఇప్పటికీ 50 కుటుంబాలు వారసత్వంగా నారాయణవనంలో చీరల నేతనే వృత్తిగా కొనసాగించడం విశేషం. చెన్నై, బెంగులూరు, కంచిలకు నారాయణవనం చీరలు పంపుతారు.

- నారాయణవనం, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- ఇమిటేట్ పట్టు మీద పోస్టర్ డిజైన్ చీరలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. చీరంతా డిజైన్ నిండి ఉండడం వీటి ప్రత్యేకత. వీటి ధరలు రూ. 5 వేల నుంచి 60 వేల దాకా ఉన్నాయి.
- నారాయణవనంలో నేసే ఇతర చీరలు డిజైన్‌ను బట్టీ రూ. 7500 నుంచి రెండు లక్షల దాకా ఉంటాయి.

ఎత్నిక్ ఫ్యాషన్ కాళహస్తి కలంకారీ

ఆలయకళగా ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి కలంకారీ.. ఇప్పుడు వస్త్ర ప్రపంచంలో లేటెస్ట్ ఫ్యాషన్‌గా మారింది. వయ్యారాల వొంపులు తిరిగే పూలూ, లతలతో కూడిన డిజైన్ చీరలకు డిమాండ్ ఎక్కువ. పౌరాణిక ఘట్టాలను రాసిన కలంకారీ చీరల కోసం సంపన్న మహిళలు పోటీ పడుతుంటారు. బ్లాక్ ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్‌తో ఉన్న కలంకారీ చీరలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నా శ్రీకాళహస్తి పెన్ కలంకారీకి ఉన్న డిమాండ్ తరగనిది. చేత్తో బొమ్మ గీసి, లతలూ పూల డిజైన్లు రాసి, వాటికి ఒక్కో దశలో ఒక్కో రంగు అద్దుతూ చేసే కళాత్మక ప్రక్రియ ఇది. చెట్ల ఆకులూ, వేర్లతో కూడిన సహజసిద్ధమైన రంగులే శ్రీకాళహస్తి కలంకారీ చీరలకు ఎక్కువగా వాడుతారు. శ్రీకాళహస్తిలో 35 కలంకారీ యూనిట్లు ఉన్నాయి. వందలాదిమందికి ఇవి ఉపాధి చూపుతున్నాయి. ఏటా శ్రీకాళహస్తి నుంచి 60 నుంచి 70వేల కలంకారీ చీరలు ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





లేటెస్ట్ ట్రెండ్

- జరీ అంచున్న కంచిపట్టు చీర మీద కలంకారీ డిజైన్ రాసిన చీరలకు ఇప్పుడు డిమాండ్ ఉంది. వీటి ధర రూ.20వేలనుంచి రూ.30వేల దాకా ఉంటుంది.
- టస్సర్, టిస్యూ, బెంగళూరు సిల్క్, చందేరి సిల్క్, మదనపల్లి పట్టు, మంగళగిరి సిల్క్, క్రేప్ క్లాత్, లెనిన్‌క్లాత్, కోట సిల్క్ చీరల మీద కలంకారీ డిజైన్లు ధరించేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. వీటి ధర రూ.10వేలు నుంచి రూ.20వేల వరకు ఉంది.

పోలూరు సరిగ చీరలు



సూళ్లూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు సరిగచీరలు ప్రత్యేకమైనవి. చేనేత నుంచి మరమగ్గాలకు ఎక్కువగా మారిపోయినా ఇప్పటికీ సంప్రదాయంగా ఇక్కడ చేనేత చీరలు కూడా తయారవుతున్నాయి. అయిదు రకాల చీరలు మన్నారుపోలూరులో నేస్తారు. పడగూ, పేకా కూడా పట్టు నూలు కలిగిన పూర్తి పట్టు చీరలు, కాటన్‌పై పాలిస్టర్ చీరలు, కాటన్‌పై పట్టు, జరీ బాండ్ చీరలు , సాధారణ కాటన్ చీరలు ఇక్కడ తయారవుతాయి. తరాలుగా ఇక్కద వందలాది కుటుంబాలు చేనేతనే జీవనాధారం చేసుకున్నాయి. కంచి, ఆరణి లకు ఈ చీరలు పంపుతారు.

-సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- మన్నారుపోలూరులో నేసే గ్రాఫికల్ డిజైన్ పట్టు చీరలను తాజాగా ఇష్టపడుతున్నారు. జరీ బార్డర్, బుటా, నిండు డిజైన్‌గల కొంగు.. ఈ చీరల ప్రత్యేకత. వీటి ధరలు రూ.1500 నుంచి 15 వేల దాకా ఉన్నాయి.





మగువలు మెచ్చే మగ్గం డిజైన్స్

నగరంలో ట్రెండ్ మగ్గం వర్క్ చీరలు. పెళ్లిళ్లలో ఇవే హైలెట్. కోరిన డిజైన్లను కోరిన రంగు మీద, నచ్చిన క్లాత్‌పై కుట్టించుకోవచ్చు. మెషీన్ ఎంబ్రాయిడరీ తోనూ ఇవి తయారవుతాయి కానీ, ధర ఎక్కువే అయినా చేతి పనికే డిమాండ్ ఎక్కువ. తిరుపతిలో 500 మగ్గం సెంటర్లు ఉన్నాయంటేనే ఈ రకం చీరలపై మహిళలకున్న మోజు ఎలాంటిదో అర్థం అవుతుంది. వివిధ రంగుల దారాలతో పాటూ చమ్కీలు, జరీ, అద్దాలు కూడా డెకరేటివ్‌గా కుడతారు. నెట్‌లో ఎంపిక చేసుకున్న డిజైన్ ఫోటోలు చూపి అలా కుట్టించుకునే సౌలభ్యం ఉండడం దీని ప్రత్యేకత.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

ఆన్‌లైన్ డిజైన్స్‌ను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. చీర వారే తెచ్చుకుంటారు. డిజైన్‌ను బట్టీ ఒక్కో చీరకు రూ. రెండు వేల నుంచీ ఇరవై వేల దాకా మగ్గం పనికే తీసుకుంటారు. ఈ చీరలు మార్కెట్‌లో లక్ష దాకా పలుకుతాయి.

ఘనంగా అమరరాజా 39వ వ్యవస్థాపక దినోత్సవం



రేణిగుంట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని అమరరాజా పరిశ్రమలో శుక్రవారం 39వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరరాజా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. 1985లో అమరరాజా పవర్ సిస్టమ్‌గా కార్యకలాపాలు ప్రారంభించిన గ్రూప్ ఇప్పుడు ఆరు కంపెనీలు, 17 వ్యాపారాలతో 18,500కుపైగా ఉద్యోగులను కలిగి ఉందన్నారు. అనంతరం ఎంపిక చేసిన ముగ్గురు గ్రామీణ పారిశ్రామికవేత్తలకు రూ.3లక్షల నగదు పురస్కారాన్ని అందించారు. అమర రాజాకు చెందిన మార్కెటింగ్ హెచ్‌ఆర్, ఫైనాన్స్, సప్లై చెయిన్ సీఎక్స్‌వోలకు సంవత్సరం మెంటార్‌షిప్ అందించారు. ఎంబీటీ తొలి అంతర్జాతీయ అంధ విద్యార్థి శ్రీకాంత్ బొల్లా తన స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అమరరాజా పరిశ్రమ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, డాక్టర్ రమాదేవి గౌరినేని, హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య, సిద్ధార్థ్ గల్లా, గ్రూప్ ఆపరేషన్ హెడ్ నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మ్యారిటైమ్ బోర్డుకు 'పులికాట్' పనులు

తిరుపతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మ్యారిటైమ్ బోర్డుకు అప్పగించింది. జిల్లాలోని తడ, సూళ్ళూరుపేట, దొరవారిసత్రం, వాకాడు మండలాల పరిధిలో సరస్సు వున్న సంగతి తెలిసిందే. తమిళనాడు పరిధిలోని సరస్సులో సముద్ర ముఖ ద్వారాలకు తరచూ పూడిక తీస్తున్నారు. జిల్లా పరిధిలో మాత్రం గత ప్రభుత్వాలు విస్మరించడంతో ఇక్కడి సముద్ర ముఖద్వారాలన్నీ పూడిపోయాయి. సముద్రపు నీరు సరస్సులోకి రాకపోవడంతో సముద్ర రకాల చేపలు, రొయ్యలు, ఇతర రకాల మత్స్య సంపద ఇక్కడ అభివృద్ధి చెందడం లేదు. వీటిపై ఆధారపడ్డ మత్స్యకార కుటుంబాలు తమ పరిధి దాటి చేపల వేటకు వెళ్లాల్సి రావడంతో తరచూ తమిళనాడు జాలర్లతో సరిహద్దు తగాదాలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు సముద్ర ముఖద్వారాల పూడిక తీతకు రూ. 97 కోట్లు కేటాయించారు. వాకాడు మండలం పూడిరాయి దొరువు వద్ద చేపట్టాల్సిన ఈ పనులను ఏపీ మ్యారిటైమ్ బోర్డుకు అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆవిష్కరణలకు దిక్సూచిగా ఏపీ

- సీఐఐ రాష్ట్ర చైర్మన్ మురళీకృష్ణ
- వర్చువల్‌గా మాట్లాడిన సీఎస్ నీరబ్

తిరుపతి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలకు దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ అన్నారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఏపీ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో దార్శనిక నాయకులు, ఆవిష్కర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొని సుస్థిర వృద్ధికి ఉన్న అవకాశాలను అన్వేషించారు. ప్రారంభ సెషన్‌లో మురళీకృష్ణ స్వాగతోపన్యాసం చేస్తూ అభివృద్ధిని ప్రోత్సహించడానికి అపారమైన ప్రతిభ, వనరులను ఏపీ ఉపయోగించుకుంటుందన్నారు. అందరం కలిసి మరింత సమ్మిళిత, సృజనాత్మక, సుసంపన్న భవిష్యత్తుకు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వర్చువల్‌గా మాట్లాడారు. సరికొత్త ఆవిష్కరణలు అవసరమని, ఆదిశగా ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంసిద్ధతతో ఉన్నాయన్నారు. అరకువ్యాలీ నుంచి వస్తున్న అరబిక్ కాఫీ, ఇటీవల ఆవిష్కృతమైన సెలైన్ వాటర్ లాంథర్ గురించి ప్రస్తావించారు. ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ.. విజ్ఞాన ఆధారిత సహకారాలను సృష్టించడంలో ఉన్నత విద్యా సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో రెండు, మూడు కేంద్ర విద్యా సంస్థలు మాత్రమే ఉండగా నేడు చాలా వచ్చాయన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో స్టార్టప్ బిజినెస్ అభివృద్ధి కోసం ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. బలమైన ఎకోసిస్టమ్స్, స్టార్టప్‌లకు తిరుపతిలో ఉన్న ప్రయోజనాలను వివరించారు. తిరుపతిలో బలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి అందుబాటులో ఉన్న అనేక పథకాలను పరిశ్రమలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఐఐ తిరుపతి జోన్ చైర్మన్ పుష్పిత్ గార్గ్ మాట్లాడుతూ సృజనాత్మకత సంస్కృతిని పెంపొందించడం ద్వారా ఏపీలో సుస్థిర భవిష్యత్తును నిర్మించవచ్చన్నారు. సుస్థిరాభివృద్ధికి కేంద్రంగా మారడానికి తిరుపతికి అపారమైన సామర్థ్యం ఉందని సీఐఐ ఆంధ్రప్రదేశ్ మాజీ చైర్మన్ విజయ్ నాయుడు గల్లా వివరించారు. సుస్థిర అభివృద్ధికి తోడ్పడేందుకు ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్స్ అవసరాన్ని ఎన్‌ఆర్‌డీసీ సీనియర్ రీజినల్ మేనేజర్, డబ్ల్యూఐపీవో టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ హెడ్ డాక్టర్ బిజయ్ కుమార్ సాహు స్పష్టం చేశారు. డిజిటల్ టెక్నాలజీ కన్సల్టెంట్, ఐటీ మాజీ రీజినల్ డైరెక్టర్ సునీల్ డేవిడ్ మాట్లాడుతూ కర్ణాటక తరహాలో ప్రతి రాష్ట్రానికి తమ బ్రాండ్ కాఫీని కస్టమైజ్ చేసినట్లుగా డైనమిక్స్ ఉన్నాయన్నారు. తిరుపతిలో 50కి పైగా ఐటీ కంపెనీలు, 10కి పైగా ఎమ్మెన్సీ కంపెనీలు ఉన్నాయని టెక్నాలజీ కంపెనీస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (టీసీఏఏపీ) అధ్యక్షుడు వంశీకృష్ణ రాయల్ తెలిపారు. తిరుపతికి ఉన్న ఉత్తమ అవకాశాల్లో శ్రీసిటీ ఒకటన్నారు. అనంతరం జరిగిన చర్చల్లో విద్య, వైద్యం, మార్కెటింగ్ వంటి రంగాలకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సందేహాలను ప్యానెల్ సభ్యులు నివృత్తి చేశారు.



రికార్డులు దహనంచేసి భూముల కబ్జా

- వైసీపీ పాలనలో అక్రమాలపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రేణిగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రెవెన్యూ రికార్డులను దహనంచేసి ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో తమకు ఇష్టమొచ్చినట్లుగా ఆన్‌లైన్‌లో పేర్లు మార్చుకుని భూములు కాజేశారన్నారు. రేణిగుంట మండలం అన్నాస్వామిపల్లెలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నల్లకోటును అడ్డుపెట్టుకుని చేసిన భూదందాను వెలికి తీస్తామన్నారు. ప్రభుత్వ భూమిలో బంగ్లా నిర్మించుకుని నివాసం ఉండడాన్ని గుర్తించినట్లు తెలిపారు. సూరప్పకశం, కొత్రమంగళంలతోపాటు ఈ గ్రామంలోని సర్వే నెం. 385, 341/1, 342/3, 343/3, 338/1, 2, 334, 335లలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. అన్నాస్వామిపల్లెలో భూములను రీసర్వే చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. త్వరలోనే కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయాన్నీ వదల్లేదు

మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ముక్కంటి ఆలయాన్నీ వదలకుండా దోచుకున్నారని సుధీర్‌రెడ్డి విమర్శించారు. జగనన్న కాలనీల కోసం స్థలసేకరణలో అగ్రిమెంట్లు చేసుకుని కేవలం రూ.7లక్షలు వంతున రైతులకు చెల్లించి ప్రభుత్వం నుంచి రూ.45 కోట్లు కొట్టేశారన్నారు. శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాల తొలగింపులో కనిపించని మాజీ ఎమ్మెల్యే.. స్వర్ణముఖి నది ఒడ్డున ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులను అడ్డుకోవడంలో అంతర్యమేమిటో చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో కొంత మంది రేణిగుంట పరిసరాల్లో ఆక్రమిత భూముల్లో ప్లాట్లు వేసి విక్రయించారన్నారు. ఇలాంటి ప్లాట్లు కొనవద్దని తాను అప్పట్లో చెప్పానని గుర్తుచేశారు. ఎవరైనా వీటిని కొని నష్టపోతే అందుకు వైసీపీ నాయకులే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు సురేష్ బాబు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



2018కి ముందు, తర్వాత కబ్జా భూముల్లో తేడాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

పోక్సో కేసులో నలుగురికి పదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను ప్రేమించానని నమ్మించి అమెపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తితోపాటు అందుకు సహకరించిన మరో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు....ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన దండోలు సుబ్బారావు అలియాస్ సుబ్బు 10వ తరగతి చదువుతున్న ఓ బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడికి బుచ్చినాయుడు కండ్రిగ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన కోగిలి సుబ్రహ్మణ్యం, ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన ఎల్లంటి వెంకటయ్య, బాలాయపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన మంగుళూరు వాణి సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓజిలి పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులు ఒక్కొక్కరికి పదేళ్ల చొప్పున జైలు శిక్ష, 22 వేల రూపాయల వంతున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

అమిత్‌షాపై పోస్టింగ్

పోలీసులకు బీజేపీ నేతల ఫిర్యాదు

వెదురుకుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేది బీజేపీయే అని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు.శుక్రవారం చిత్తూరు జిల్లా కార్వేటినగరంలో బీజేపీ నేతలు రాజశేఖర్, రాజేంద్రన్, యువరాజు మాట్లాడుతూ... అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారని వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కార్వేటినగరం మండలానికి చెందిన వ్యక్తి ఒకరు సోషల్ మీడియాలో అమిత్‌షా చనిపోయాడని, శ్రద్ధాంజలి ఘటించాలని, డీపీగా ఫొటోలు వాడుకోవాలని పోస్టింగ్ పెట్టడంతో శుక్రవారం కార్వేటినగరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.కార్వేటినగరం మండల బీజేపీ నాయకులపై కూడా హేయమైన పోస్టింగులు పెట్టారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.6.30 కోట్లతో ఎస్సీ వసతి గృహాల అభివృద్ధి



ఎస్సీ బాలికల వసతిగృహం-1 మరుగుదొడ్లను పరిశీలిస్తున్న చెన్నయ్య, ఏఎస్ డబ్ల్యూవో సుధామయి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ వసతి గృహాల అభివృద్ధి కోసం 6.30 కోట్లు మంజూరైనట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహం-1, 2, జూనియర్ కళాశాల బాలికల వసతి గృహాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం చెన్నయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి బాలాంజనేయులు ప్రభుత్వ వసతిగృహాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 55 ప్రభుత్వ ఎస్సీ సంక్షేమశాఖ వసతి గృహాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు రూ.6.30 కోట్ల నిధులను వినియోగం చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా బాలికల వసతిగృహాల్లో మరుగుదొడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేవిధంగా చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. ఆయన వెంట ఏఎస్ డబ్ల్యూవో సుధామయి, వార్డెన్లు సరిత, ఉమ ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



చెన్నూరులో ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు, వైద్యులు, సిబ్బంది

గూడూరు అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలను అందించేందుకు వైద్యులు, సిబ్బంది అంకిత భావంతంలో పనిచేయాలని టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారి డాక్టర్ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని చెన్నూరు పీహెచ్‌సీ, నెర్నూరు సబ్ పీహెచ్‌సీలను ఆయన శుక్రవారం సందర్శించారు. గ్రామాల్లో గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై, సీజనల్ వ్యాధులపై పలు సూచనలు అందించారు. అనంతరం సచివాలయాల వైద్యసిబ్బందితో సమీక్షించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు లీలాకృష్ణ, సిబ్బంది నాగేంద్రకుమార్, నరేష్‌బాబు, ప్రకాష్, అరుణ, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న ప్రజాసమస్యల పరిష్కార వేదిక

గూడూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో ఈనెల 23వ తేదీన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈఈ ముని రవిచంద్ర శుక్రవారం తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేనకూరు సెజ్‌లో పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేయండి



డీఎస్పీ చెంచుబాబుతో మాట్లాడుతున్న పరిశ్రమల ప్రతినిధులు

నాయుడుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేయాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబుకు పరిశ్రమల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సెజ్‌లో పరిశ్రమల ప్రాంగణాల్లో వస్తువులు చోరీకి గురవుతున్నాయని తెలిపారు. సెజ్‌లోని పోలీస్ పెట్రోలింగ్ చేయడం ద్వారా దొంగతనాలు అరికట్టడంతో పాటు ఉద్యోగులకు భద్రత ఉంటుందన్నారు. మేనకూరు సెజ్ నుంచి నాయుడుపేట పోలీస్‌స్టేషన్ దూరం కావడంతో సమాచార జాప్యంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సెజ్‌లో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

గురుకుల అధ్యాపకురాలు శశికళకు సన్మానం



శశికళను సన్మానిస్తున్న ప్రొఫెసర్ ఆశాజ్యోతి

నాయుడుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు యూనివర్శిటీ తెలుగు విభాగ స్వర్ణోత్సవ వేడుకల్లో నాయుడుపేట మండలం పుదూరు గురుకుల అధ్యాపకురాలు తన్నీరు శశికళను సత్కారించారు. గిరిజన సంస్కృతి, వారి పండుగలపై అధ్యయన పత్రాన్ని శశికళ బెంగళూరు యూనివర్శిటీకి సమర్పించారు. శుక్రవారం బెంగళూరు యూనివర్శిటీలో జరిగిన తెలుగు విభాగ స్వర్ణోత్సవ వేడుకల్లో శశికళను ప్రొఫెసర్ ఆశాజ్యోతి సత్కరించి ప్రసంశాపత్రాన్ని అందజేశారు. శశికళను పుదూరు గురుకుల ప్రిన్సిపాల్ రూత్‌రమోలా, అధ్యాపకులు అభినందించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

వాకాడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలంలోని మొలకలపూడి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన పది మద్యం బాటిళ్లను ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కమతం చంద్రశేఖర్‌ను అరెస్టు చేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

గూడూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జిలానీబాషా అన్నారు. శుక్రవారం కళాశాల అధ్యాపకుడు సహకారంతో 25 కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విరివిగా మొక్కలను నాటడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు.

స్వర్ణముఖినదిలో గుర్తుతెలియని మృతదేహం

నాయుడుపేట టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖినది తీరాన గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు... శుక్రవారం సాయంత్రం యువకులు స్వర్ణముఖివద్దకు వెళ్లగా శ్మశానవాటికకు సమీపంలో గుర్తుపట్టలేని విధంగా ఉన్న మృతదేహాన్ని గమనించిన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరా గార్డెన్‌లో నివాసం ఉంటున్న చిరంజీవి(43) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... శుక్రవారం సాయంత్రం కుటుంబసభ్యులు లేని సమయంలో చిరంజీవి ఉరివేసుకొని మృతి చెందాడు. ఇంటికి వచ్చాక గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని చిరంజీవి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటల బీమాకు నమోదు చేసుకోండి

పెళ్లకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో పంట రుణం పొందిన రైతులందురూ బీమా నమోదు చేసుకోవాలని పెళ్లకూరు బ్రాంచ్ మేనేజర్ నాగాంజనేయులు తెలిపారు. రబీలో సాగు చేసే వరికి రూ.630 ప్రీమియం చెల్లించి ఈనెల 31లోగా బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. బీమా అవసరం లేని రైతులు 24లోగా బ్యాంకు సిబ్బందికి తెలియజేయాలని, లేకుంటే రైతుల ఖాతా నుంచి రూ.630 మినహాయించుకోవడం జరుగుతుందన్నారు.

దుస్థితిలో పార్కులు

- పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు
- గంజాయి, మందుబాబుల అడ్డా
- పట్టించుకోని అధికారులు





పోలిశెట్టిగుంట పార్కులో అధ్వానంగా ఉన్న చిన్నారి ఆట వస్తువు - కుమ్మరిగుంట పార్కులో విరిగిన బెంచీలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్షణం తీరిక లేని పనులతో నిత్యం మానసిక ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో సాయంత్రం వేళ కాసింత ఆహ్లాదకరమైనా వాతావరణంలో గడపాలని ప్రతి ఒక్కరికీ ఎంతో ఆపేక్ష ఉంటుంది. అయితే వెంకటగిరి పట్టణంలో పార్కులు అనువుగా లేకపోవడం వల్ల స్థానికులు ఆహ్లాదకర వాతావరణానికి దూరమవుతున్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచిపెట్టిన పార్కుల నిర్వాహణ కోసం మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారాయి. చిన్నారులకు ఆట, పాటలు, పెద్దలు ఉదయం, సాయంత్రం వాహ్యాళికి ఉపయోగపడిన పార్కులు దుస్థితికి చేరుకున్నాయి. వెంకటగిరి పట్టణానికి మున్సిపాలిటీ హోదా లభించిన కొత్తలో కుమ్మరిగుంట వద్ద రూ.10లక్షలు ఖర్చు చేసి పార్కు నిర్మించారు. కుమ్మరిగుంటలో కొంత కాలం బోటు షికారు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహణ లోపం వల్ల బోటు షికారు ఆపేయగా ప్రస్తుతం పార్కు కూడా దుస్థితిలో ఉంది. కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బల్లలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముళ్లపొదలు, చెట్లు పెరిగిపోవడం మద్యం ప్రియలకు అడ్డాగా మారింది. దీంతో చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు కూడా పార్కుకు రావడంతో మానేశారు. అలాగే పోలిశెట్టి గుంట వద్ద రూ.20లక్షలతో మరో పార్కు ఏర్పాటు చేశారు. అయితే పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో నిరుపయోగంగా మిగిలిపోయింది. బల్లలు, చిన్నారులు ఆడుకునే వస్తువులు విరిగి పోవడంతో ఎవరూ రావడం లేదు. గంజాయి, మందుబాబులు సంచరిస్తుండడంతో పార్కుకు వెళ్లేందుకు భయపడుతున్నారు. సమీపంలో పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, మద్యం, గంజాయి వినియోగదారులను కట్టడి చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు చొరవతీసుకుని పార్కులను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసకురావాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పేదల భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదు: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదల భూములను ఎవరైనా ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదని, ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతవరం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామంలో పేదలకు చెందిన 112 ఎకరాల భూమిని పెద్దలు ఆక్రమించున్నారన్నారు. ఆ భూములను తిరిగి పేదలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ప్రవేశపెట్టి పేదల భూములకు రక్షణ లేకుండా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు తీసుకొచ్చి పేదల భూములకు రక్షణ కల్పించిందన్నారు. గ్రామంలో జమీందారి వ్యవస్థకు స్వస్తి పలికి పనిచేసే నాయకులకు పట్టం కట్టాలన్నారు. అప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీలకు అతీతంగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, రేషన్‌కార్డులు వంటివి మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా రికార్డుల ప్రకారం 99 కొళాయి కనెక్షన్లు ఉండగా, వాస్తవంగా 20 కూడా లేవని స్థానికులు తెలిపారు. గ్రామంలోని దళితవాడలో తాగునీటి సమస్య పరిష్కరించాలని,నూతన పాఠశాలను నిర్మించినా, ఆ భవనానికి కాంట్రాక్టరు తాళం వేశాడని, దేవదాయశాఖ భూములు ఆక్రమణలో ఉన్నాయని, పీహెచ్‌సీలో రాత్రిపూట వైద్యులు, అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూడాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎన్నికల సమయంలో వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన గోపాల్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, లీలావతి, చిరంజీవి, కీరవాణి, వెంకటేశ్వర్లు, శ్రీను, శంకరయ్య, వెంకటకృష్ణయ్య, సాయి, తహసల్దారు శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని గాంధీనగర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాతో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లురాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంక్ సేవలను వినియోగించుకోండి



సమావేశంలో రీజనల్ మేనేజర్ మోహన్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్ రజనీ, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీను

కోట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా రీజనల్ మేనేజర్ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోటలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌ను ఆయన తనిఖీ చేశారు. బ్యాంక్‌లోని ఇంటర్నెట్ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు తిరుపతి, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 68శాఖలతో రూ.6,300 కోట్ల వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. కోట బ్రాంచ్‌లో రూ.48 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుపుతున్నారన్నారు. ప్రగతి రూఫ్ టాప్ సోలార్ పథకం ద్వారా రూ.78వేల వరకు ఖాతాదారులు సబ్సిడీ పొందవచ్చాన్నారు. స్వగృహ, విద్య, రుణాలతో పాటు ప్రగతి మల్టీపర్పస్ మార్టిగేజ్ రుణాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఈ పథకాల కింద రుణాలు తీసుకోవచ్చన్నారు. అదేవిధంగా రుణాలు పొంది సకాలంలో చెల్లించని మొండి బకాయిదారుల కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకాల ఫలాలను ప్రతి ఖాతాదారుడికీ అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంట బ్యాంక్ మేనేజర్ రజనీ, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీను, క్యాషియర్ నితిన్‌సాయి ఉన్నారు.

చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు

పెళ్లకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు వేళ్లేవారు ఇళ్లకు సైరన్ ఉండే తాళాలు వేసుకోవాలన్నారు. గ్రామాల్లో రాత్రి సమయంలో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దారి సమస్య పరిష్కారం



ఎక్స్‌కవేటర్‌తో దారిని ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దారు రామయ్య

వాకాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వడ్డిపాళెం గ్రామంలో ఎన్నో యేళ్లుగా నెలకొన్న దారి సమస్య రెవెన్యూ సదస్సు పుణ్యమాని పరిష్కారం అయింది. మండలంలోని కొండాపురం పంచాయతీలో శుక్రవారం తహసీల్దారు రామయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. టీడీపీ నాయకుడు తుమ్మల మోహన్ నాయుడు ఆధ్వర్యంలో గ్రామస్థులు దారి సమస్యను తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన తహసీల్దారు సంబంధిత అధికారులతో కలిసి దారిని పరిశీలించారు. అక్కడిక్కడే పరిష్కరించి ఎక్స్‌కవేటర్‌తో దారి ఏర్పాటు చేయించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు వివిధ సమస్యలపై 79 అర్జీలు అందజేశారని, వాటిని 45రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దారు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో కాటమ్మ, టీడీపీ నేత గోపీనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుడ్డ సంచుల వితరణ

కోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద గోవిందపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీతారామ ధార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో గుడ్డ సంచులను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి అనంతాచార్యులు, డాక్టర్ వాకాని కృష్ణ ప్రసాద్, హెచ్‌ఎం గిరిధర్‌బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలపై దాడి హేయమైన చర్య

గూడూరు అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతలపై అధికార బీజేపీ నేతలు బలప్రయోగం చేయడం హేయమైన చర్యగా గూడూరు కాంగ్రెస్ పార్టీ గూడూరు ఇన్‌చార్జి పరిమల వెంకటేశ్వరరావు అభివర్ణించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల ఉదంతాన్ని తప్పుదోవ పట్టించేందుకే పార్లమెంటులో ప్రతిపక్షాలను బీజేపీ నాయకులు రెచ్చగొట్టారని ఆయన విమర్శించారు. అమిత్‌షాపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

శ్మశాన దారికి స్థల పరిశీలన

సూళ్లూరుపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొమ్మినేనిపల్లి, బీసీ కాలనీ, దళితవాడ శ్మశానానికి వెళ్లే దారికోసం అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఇటీవల సూళ్లూరుపేటలో కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆ గ్రామస్తులు శ్మశానికి వెళ్లేందుకు దారిలేదని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వీఆర్వో ఉషా, సర్వేయర్ బాలాజి, సచివాలయ సిబ్బంది స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి పాకం వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

కోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జయ జయరావు కోరారు. మండల పరిధిలోని దైవాలదిబ్బ, పుచ్చలపల్లి, గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. కార్యక్రమంలో ఆర్ఐ మధులత, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వీఆర్వో కృష్ణయ్య, సర్వేయర్ గోపీరెడ్డి ఉన్నారు.

సూళ్లూరుపేట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామా నెల్లూరులో ఆర్ఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై 12, ఇంటి స్థలం కోసం 4, శ్మశానానికి రోడ్డు నిర్మాణం కోసం 3 అర్జీలు వచ్చాయి. వీఆర్వో దివ్య నందిత పాల్గొన్నారు.

నాయుడుపేట (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టాదారు పాసు పుస్తకాల కోసం 6 అర్జీలు, పొలాలు సర్వే చేయాలని రెండు, ఇతరుల ఆధీనంలో ఉన్న తమ పొలాలను అప్పగించాలంటూ రెండు అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి హరోహరా, ఎండోమెంట్ ఈవో రవికుమార్, ఆర్ఐ సాయితేజ, వీఆర్వో శ్రీనివాసులు, మౌనిక, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ శ్రీరామ్‌ప్రసాద్, సీడీసీ మాజీ చైర్మన్ కట్టా సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగల్లు, సిద్ధాగుంట గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బి నమోదు కోసం 20 అర్జీలు, ధృవపత్రాల కోసం రెండు వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో సర్పంచులు కాల్తిరెడ్డి, రత్నమ్మ, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, డిసెంబరు 20,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద శ్రీశ్రీనివాస సేవా ట్రస్టు (టీవీఎస్) ఆధ్వర్యంలో తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 240మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, 20మందిని ఆపరేషన్ ఎంపిక చేసినట్లు ట్రస్టు క్లస్టర్ ఇన్‌ఛార్జి జయసింగ్ తెలిపారు. వారిని తిరుపతికి తీసుకువెళ్లి ఆపరేషన్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అలేఖ్య, పార్థు, సతీష్, పలువురు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మ ఆలయంలో శుక్రవారం టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు చాపల శ్రీనివాసులు వితరణతో భక్తులకు అన్నదానం జరిగింది.

జగనన్న కాలనీలు మునిగిపోతున్నాయ్

మరోచోట ఇళ్ల స్థలాలు కేటాయించండి

- ఆర్డీవోకు వాటంబేడు గ్రామస్తుల మొర



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

తడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో కేటాయించిన ఇళ్ల స్థలాలు వర్షం వస్తే మునిగిపోతున్నాయని, తమకు మరోచోట నివాస స్థలాలు ఇవ్వాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయికి వాటంబేడు గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. శుక్రవారం వాటంబేడు, కారిజాత గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఆర్డీవో కిరణ్మయి పాల్గొని అర్జీలు స్వీకరించారు. మొత్తం 30 వినతులు రాగా, ఇందులో భూముల సర్వే, ఇళ్ల స్థలాల మంజూరు కోసం అర్జీలు సమర్పించారు. తాము పొలాలకు వెళ్లే మార్గంలో గత ప్రభుత్వ హయాంలో అప్పటి నాయకులు సచివాలయం, ఆర్బీకే భవనాలను నిర్మించి దారిలేకుండా చేశారని, సమస్యకు పరిష్కారం చూపాలని వాటంబేడు గ్రామస్తులు కోరారు. సదస్సులో తహసీల్దారు శరత్‌బాబు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకుడు బొమ్మన ఏకాంబరం పాల్గొన్నారు.


భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



సదస్సులో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, సిద్దులయ్య నాయుడు, పీవీ కృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు తదితరులు

పెళ్లకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నందిమాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 14 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 121 వినతులు వచ్చాయన్నారు. వాటిలో 18 అక్కడికక్కడే పరిష్కరించామని, మిగిలిన వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సర్పంచు వెంకటయ్య, వీఆర్వోలు బూదనం రమేష్, వంశీకృష్ణ, నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, సిద్దులయ్య నాయుడు, పీవీ కృష్ణారెడ్డి, మదన్‌మోహన్ నాయుడు, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్లు, రేషన్ కార్డుల కోసం అర్జీలు



మాటుమడుగులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

డక్కిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాటుమడుగు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ పలువురు అర్జీలు అందచేశారు. కొంతమంది తమకు సాగు భూములు ఇవ్వాలని కోరారు. మొత్తం 67 అర్జీలు వచ్చాయని, అన్నింటినీ పరిశీలించి త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయరు రాజగోపాల్, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

కోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, బాలకృష్ణ తెలిపారు. కోటలోని ప్రగతి విద్యాసంస్థల్లో శుక్రవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయండి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం స్వర్ణోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. తిరుపతిలో ఈనెల 22, 23 తేదీల్లో జరగబోవు స్వర్ణోత్సవ మహాసభల్లో యూటీఎఫ్ నాయకులు, సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామమూర్తి, శేఖర్, సుబ్బారావు, గోవర్ధన్‌రెడ్డి, వాసు, శివ, శ్రీనివాసులు, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల యూటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తడ(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయాలని ఆ సంఘ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, రవికుమార్ విజ్ఞప్తి చేశారు. స్వర్ణత్సవ సభల పోస్టర్లను ఆవిష్కరించారు.